

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 29.0
కనిష్ఠం : 24.0



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పారథి

ఎరువుల కొరత రానీయొద్దు
మంత్రి కొలుసు

నూజివీడు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఎక్కడ ఎరువుల కొరత ఉండకూడదని, రాష్ట్ర సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశించారు. నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆయన రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో శనివారం ఎరువుల సరఫరాపై సమీక్షించారు.నూజివీడు, చింతలపూడి ప్రాంతాల్లో మొక్కజొన్న,పొగాకు, పత్తి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారని ఎరువులు కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.సబ్‌కలెక్టర్ వినూత్న, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎరువులు తరలిపోకుండా చెక్‌పోస్టులు : కలెక్టర్

ఏలూరుసిటీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచి ఎరువులు ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా జిల్లా, అంతరాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ఠ నిఘా పెట్టాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎరువుల లభ్యత, సరఫరాలపై శనివారం కలెక్టరేట్ నుంచి సంబంధిత శాకాధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

75,777 మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీ

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు 75,777 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులు అందించినట్టు కలెక్టర్ శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. 10, 13 తేదీల్లో మరో 1000 మెట్రిక్ టన్నులు యూరియా జిల్లాకు వస్తుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 2,194 మెట్రిక్ టన్నుల యూరియా, 2,982 మెట్రిక్ టన్నులు డీఏపీ, 4,612 మెట్రిక్ టన్నులు ఎంవోపీ, 13, 320 మెట్రిక్ టన్నులు ఎన్‌పీకే, 5,715 మెట్రిక్ టన్నులు ఎస్ఎస్‌టీ అందుబాటులో ఉన్నాయన్నారు.

పోలవరం భూసేకరణపై సమీక్ష

ఏలూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):పోలవరం ప్రాజెక్టు పనులపై శనివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్షించారు. ఏలూరు, తూర్పుగోదావరి, మన్యం జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భూమికి భూమి, కాలనీల నిర్మాణాలు, ఇతర పనులు త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 4,434 ఎకరాల సేకరణ లక్ష్యంకాగా, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో 2,181 ఎకరాల భూమిని గుర్తించామన్నారు.





బై..బై గణేశా..

'వెళ్ళి రావయ్య గణపయ్య మళ్ళీ రావయ్య లంబోధరా.. అంటూ జిల్లాలో గణేష్ నిమజ్జనాలు శనివారం కోలాహలంగా సాగాయి. తొమ్మిది రోజులు పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. ఏలూరు నగరంలో భారీ వినాయక విగ్రహాలను క్రేన్‌ల సాయంతో తరలించి నిమజ్జనం చేశారు.



మైనర్ చెరువులకు మోక్షం

జిల్లాలో చిన్ననీటి పారుదల వ్యవస్థ అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. వైసీపీ జమానాలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన మైనర్ ఇరిగేషన్ చెరువుల ప్రక్షాళనకు టీడీపీ ప్రభుత్వం చర్యలకు ఉప క్రమించింది. మరమ్మతులు, రీస్టొరేషన్, రీ కన్‌స్ట్రక్షన్ (ఆర్‌ఆర్ ఆర్) పథకం కింద జిల్లా వ్యాప్తంగా 28 మండలాల్లోని 1,548 మైనర్ ఇరిగేషన్ చెరువులుండగా 1,513 చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నారు.

\- ఏలూరు-ఆంధ్రజ్యోతి

- ట్రిపుల్ ఆర్ కింద 1,548 చెరువుల ప్రక్షాళన
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అభివృద్ధి
- త్వరలో పనులు ప్రారంభం

లక్షా 22వేల ఎకరాలకు ప్రయోజనం

జిల్లాలో మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద లక్షా 22వేల850 ఎకరాల పంటలు సాగువుతున్నాయి. అయితే నీటి ప్రవాహాలకు అవరోధంగా ఈ చెరువులు అవసానకు దశకు చేరాయి. కృష్ణా జిల్లా నుంచి ఏలూరులో జిల్లాలో చేరిన చాట్రాయి, ముసునూరు, నూజివీడు, ఆగిరపల్లి మండలాల్లోను 368 మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద 24,707 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ప్రధానంగా ఈ చెరువుల్లోకి 80 శాతం మేర వర్షాధారంతో నింపాల్సి ఉంటుంది. అయితే క్షేత్రస్థాయిలో అందుకు తగ్గ ఏర్పాట్లు, వ్యవస్థ అభివృద్ధి చెందక సాగునీటి కష్టాలను రైతన్నలు ఎదుర్కొంటున్నారు. ఈ చెరువులకు దగ్గరగా తమ్మిలేరు, ఎర్రకాల్వ రిజర్వాయర్లు, కొవ్వాడ కాల్వ, జల్లేరు, పొగొండ రిజర్వాయర్లు ఉన్నాయి. వీటి ద్వారా చెరువుల్లోని సమృద్ధిగా నీరు చేరాలంటే ఇప్పుడున్న మైనర్ ఇరిగేషన్ చెరువుల ప్రక్షాళనే శరణ్యంగా యంత్రాంగం భావిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే కొన్ని మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశాలను జారీ చేసింది.


చింతలపూడి పెద్దచెరువు

కేంద్రం 60.. రాష్ట్రం 40 శాతం వాటాలు

దశలవారీగా అన్ని మైనర్ ఇరిగేషన్ చెరువుల ప్రక్షాళన చేపట్టాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీ (డీఎల్‌సీ) ఇటీవల నిర్ణయించింది. తొలి విడతగా పెదపాడు, దెందులూరు మోడల్‌గా స్టడీ చేసి.. ఇందులో 20 చెరువులను రూ.2కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఈనెల 8వ తేదీన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నారు. చేపట్టే పనులకు కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం వాటాల కింద నిధులను అందించి పూర్తి చేయాలని తీర్మానించారు.

ఏమేమి పనులు చేస్తారంటే..

- చెరువుల సమీపంలో పేరుకుపోయిన చెట్ల తొలగింపు
- ప్రధానంగా చెరువుల్లో పేరుకుపోయిన తూడు, చెత్త తొలగింపుతో పాటు సప్లయ్ ఛానల్స్, ట్యాంక్ బెడ్స్ కెనాల్స్ మరమత్తులు
- ఇప్పుడున్న నీటి సరఫరా చేస్తున్న కాల్వలను విస్తరిస్తారు
- స్లూయిజ్‌లకు మరమ్మతులు, కొత్తవి అమర్చడం
- చెరువులకు నీటిని సరఫరా చేసే డ్రెయిన్లు బాగుచేత
- నీటిని మళ్లించే డైవర్షన్ చెక్ డ్యామ్‌లు, ట్యాంకుల రిపేర్లు, నూతన నిర్మాణాలు. ఈ పనుల (మిగతా 8వ పేజీలో)

చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు : కలెక్టర్

జిల్లాలో మైనర్ ఇరిగేషన్ చెరువులను అభివృద్ధి చేయడానికి ఈ నెలాఖరులోగా ప్రతిపాదనలను పంపాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో 1,513 మైనర్ ఇరిగేషన్ చెరువులను ఆర్‌ఆర్‌ఆర్ (రిపేర్, రీస్టొరేషన్, రీ కన్‌స్ట్రక్షన్) కింద దశలవారీగా అభివృద్ధికి ప్రతిపాదనలు ఇవ్వాలని అధికారులతో శనివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో కోరారు. జలవనరుల శాఖ ఎస్ఈ దేవప్రకాష్, వ్యవసాయశాఖ జేడీ హబీబ్ భాషా పాల్గొన్నారు.


ఏలూరు నిమ్మకాయల మార్కెట్‌కు నిత్యం రద్దీగా ఉండే వంతెన దుస్థితి

డేంజర్ స్పాట్స్

ఉమ్మడి పశ్చిమజిల్లాలోని పలు వంతెనలు ప్రమాదకరంగా మారాయి. వాటిలో కొన్ని కాలం చెల్లగా, మరికొన్ని శిథిలావస్థకు చేరాయి. ఈ డేంజర్ స్పాట్స్‌పై ఆంధ్రజ్యోతి పరిశీలన - లోపలి పేజీలో

దొంగనోట్ల ముఠా అరెస్టు

సైబర్ నేరగాళ్ల వలలో రిటైర్డ్ హెచ్‌ఎం

■ లోపలి పేజీలో..


కైకలూరు బైపాస్ రోడ్డులోని వినాయకుడి గుడివద్ద శుక్రవారం రాత్రి కర్రలు, రాడ్‌లతో యువకులు

కైకలూరులో ఉద్రిక్తత

- ఇరువర్గాల ఘర్షణ.. ఇద్దరికి తీవ్ర గాయాలు
- జాతీయ రహదారిపై దానగూడెం గ్రామస్థుల ఆందోళన
- జనసేనకు చెందిన ఏడుగురిపై అట్రాసిటీ కేసు


కైకలూరు తాలుకా సెంటర్లో ఆందోళన చేస్తున్న దానగూడెం గ్రామస్థులు

కైకలూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కైకలూరు కరకట్ట ప్రాంతంలో వినాయక ఉత్సవాల్లో ఇరువర్గాల మధ్య ఏర్పడిన వివాదం శనివారం కూడా ఉద్రిక్తతకు దారితీసింది. శుక్రవారం రాత్రి వినాయక నిమజ్జనం సమయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న విషయం విదితమే. ఎప్పుడూ లేనివిధంగా కైకలూరులో వందలాదిమంది యువకులు కర్రలు, రాడ్లతో రహదారులపై సంచరించడం శుక్రవారం అర్ధరాత్రి వరకు ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అసలు ఏం జరిగిందంటే..

కైకలూరు కరకట్ట ప్రాంతంలో గణేశ్ నవరాత్రుల సందర్భంగా వినాయకుడి విగ్రహం ఏర్పాటు సమయంలోనే జనసేనకు చెందిన యువకులకు, కైకలూరు శివారు దానగూడెం చెందిన యువకులతో వివాదం ఏర్పడింది. గత నాలుగైదు రోజులుగా చిన్నపాటి వివాదాలు జరిగాయి. ఈ నేపథ్యంలోనే శుక్రవారం రాత్రి నిమజ్జన ఊరేగింపులో మరల ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ నెలకొంది. దానగూడెంకు చెందిన గొంతుపులి దినేష్‌బాబు, పైఎద్దు అజయ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉద్రిక్తతల నడుమ ఎలాంటి అవాంతరాలు లేకుండా భారీ బందోబస్తుతో పోలీసులు నిమజ్జనం జరిపించారు. విషయం తెలిసి ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్ అర్ధరాత్రి రెండు గంటల సమయంలో సంఘటనా స్థలానికి చేరుకుని శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

దానగూడెం వాసుల ఆందోళన

శనివారం ఉదయం దానగూడెంకు చెందిన యువకులు పెద్దఎత్తున పోలీసు బందోబస్తును తప్పించుకుని జాతీయ రహదారిపైకి వచ్చారు. వారపు సంత సమీపంలో ధర్నా చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన దళిత నేతలు వారికి మద్దతు పలకడంతో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడి నుంచి బైపాస్‌రోడ్డులోని వినాయకుని గుడి వద్ద మరోసారి దానగూడెంకు చెందిన యువకులు ఆందోళనకు దిగారు. పోలీసులు నచ్చచెప్పేందుకు ప్రయత్నించినా వినిపించుకోలేదు. ఒక్కసారిగా పోలీసు రోప్‌ను తోసుకుంటూ ర్యాలీగా తాలుకా సెంటర్‌కు చేరుకుని మహిళలతో కలిసి జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. దాడులకు పాల్పడిన జనసేన నాయకులను తక్షణమే అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. పవన్‌కల్యాణ్ అభిమానులమని ఎన్నికల్లో కూటమి పార్టీకి మద్దతు తెలిపామని, అయినా దళితులపై (మిగతా 8వ పేజీలో)

నిలకడగా గోదావరి నీటిమట్టం

పోలవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం శనివారం సాయంత్రానికి స్వల్పంగా తగ్గింది. అల్పపీడన ప్రభావంతో ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు పెరిగిన గోదావరి నీటిమట్టం శనివారం సాయంత్రానికి స్వల్పంగా తగ్గింది. ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 8,06,738 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 31.750 మీటర్లు, స్పిల్‌వే దిగువన 23.100 మీటర్లు నీటిమట్టం నమోదయినట్టు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. తెలంగాణలోని భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 37.50 మీటర్లకు తగ్గింది. కడెమ్మ స్లూయిజ్ గేట్లు పూర్తిగా నీటమునగడంతో గేట్లు మూసుకుపోయి పంటపొలాలు ఐదు రోజులుగా నీటమునిగి ఉన్నాయి.



శిథిలావస్థకు చేరిన చినలంక వంతెన



ఏలూరు నిమ్మకాయల మార్కెట్ వద్ద బ్రిడ్జి దుస్థితి

డేంజర్ స్పాట్స్



గుర్రాలవాగు వంతెనపై పడిన గండి(ఫైల్)

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో పలు చోట్ల కాలువలపై రాకపోకలు సాగించేందుకు ఏర్పాటు చేసిన వంతెనలు శిథిలమయ్యాయి. ఎక్కడికక్కడ రక్షణ గోడలు, రెయిలింగ్‌లు ఊడిపోయిన వంతెనలపై వాహన దారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. రహదారులు, భవనాలు శాఖ అధికారులు వీటి మరమ్మతులను గాలికొదిలేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా పాత వంతెన స్థానాల్లో కొత్త వంతెనలు నిర్మించాలని, రెయిలింగ్‌ల మరమ్మతులు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి పరిశీలనలో శిథిలమైన కొన్ని వంతెనల దృశ్యాలు.

వంతెనకు మోక్షం ఎప్పుడో..?

కొత్త వంతెన నిర్మించాలని మత్స్యకారుల వినతి

నరసాపురం రూరల్‌: నరసాపురం మండలం చినలంక వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెన నిర్మించి నాలుగు దశాబ్దాలు కావడంతో చాలావరకు వంతెన కొట్టుకుపోయింది. సముద్రం ఒడ్డుకు వెళ్లాలంటే ఈ వంతెనే కీలకం. ఇటీవల వంతెన ధ్వంసం కావడంతో అక్కడక్కడ మరమ్మతులు చేపటారు. కానీ పూర్తిస్థాయిలో వంతెన నిర్మించలేదు. ఒకవేళ వంతెన కూలితే సముద్రం నుంచి వాహనాల మీదుగా మత్స్య సంపద తెచ్చుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడ్డాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త వంతెన నిర్మించాలని మత్స్యకారులు విన్నవిస్తున్నారు.

వేంద్ర-వేంద్ర అగ్రహారం వంతెన శిథిలం

పాలకోడేరు : వేంద్ర గ్రామం నుంచి వేంద్ర అగ్రహారానికి వెళ్లే జీవీ కెనాల్‌పై నిర్మించిన వంతెన కుప్పకూలడానికి సిద్ధంగా ఉంది. ఈ వంతెనను సుమారు 35 ఏళ్ల క్రితం నిర్మించారు. వంతెనకు ఇరుపక్కల ఉన్న రెయిలింగ్ పూర్తిగా పాడై వంతెన పిల్లర్లు దిగబడిపోయాయి. వేంద్ర అగ్రహారం గ్రామస్థులకు ఇదే ప్రధాన రహదారి. వేంద్ర గ్రామస్థులు సైతం వంతెన అవతలి వైపు ఉండడంతో పాటు రెండు గ్రామాలకు చెందిన పంట పొలాలు ఉన్నాయి. పండించిన ధాన్యాన్ని తెచ్చుకునేందుకు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. వంతెనపైకి భారీ వాహనాలు వెళ్లకుండా ఇనుప స్తంభాలను అడ్డుగా పాతారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి కొత్త వంతెనను నిర్మించాలని ఇరుగ్రామాల వేడుకుంటున్నారు.



శిథిలావస్థలో ఉన్న వేంద్ర అగ్రహారం వంతెన

రెయిలింగ్ ఊడిన బాపూజీపురం కాలిబాట

పెనుగొండ : పెనుగొండ బాపూజీపురం కాలిబాట వంతెన రెయిలింగ్‌లు ఊడిపోయి శిథిలావస్థకు చేరింది. స్థానిక బాపూజీపురం వద్ద నరసాపురం కాలువపై 2001లో కాలిబాట వంతెన నిర్మించారు. రైతాంగం, బాపూజీపురం వాసులు కాలిబాట వంతెనపై రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి వేళల్లో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలకు గురికాక తప్పదు. పెనుగొండలో ఫ్లైఓవర్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో ఇటీవల మరమ్మతులు చేపట్టారు. అయితే వంతెనకు కింది భాగంలో మరమ్మతులు చేయకపోవడంతో గోతులు పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దేవ గ్రామంలో పంట కాలువపై ఉన్న వంతెన, కొఠాలపర్రులో గల పంట కాలువపై ఉన్న వంతెనలు శిథిలావస్థకు చేరాయి.



పెనుగొండలో బాపూజీపురం కాలిబాట వంతెన

ఆచంట రోడ్డులో బీటలు తీసిన వంతెన

ఆచంట : ఆచంట మండలంలో కొడమంచిలి-ఆచంట రోడ్డు మధ్యలో వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెన కింది భాగం అంతా బీటలు తీసి ఉంది. కనీసం వంతెనకు రెయిలింగ్ లేదు. గతంలో ఈ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని అధికారులు చెప్పినప్పటికి అప్పుడప్పుడూ చిన్న పాటి మరమ్మతులు మాత్రమే చేపట్టేవారు. ఈ వంతెనపై బీటీ రోడ్డు ఉండడం వల్ల పైకి మాత్రం బాగానే కనిపిస్తుంది. కింది భాగం మొత్తం బీటలు తీసి ఉంటుంది. ఈ వంతెనపై నిత్యం వందలాది మంది తిరుగుతూనే ఉంటారు. అధికారులు స్పందించి కొత్త వంతెనను నిర్మించాలని కోరుతున్నారు. ఆచంట వేమవరం నుంచి పాలకొల్లు వెళ్లే రోడ్డులో వేమవరం నక్కల కాలువ వద్ద ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది.



కొడమంచిలి-ఆచంట రోడ్డు మధ్యలో వంతెన

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో వంతెనలు శిథిలం

ఏలూరు రూరల్‌/ఏలూరు కార్పొరేషన్‌, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏలూరులో మార్కెట్ యార్డు వద్ద ఉన్న వంతెన, పాత బస్టాండ్‌, సత్రంపాడు, శనివారపు పేట కాజ్‌వే రక్షణ గోడ లేక ప్రయాణికులు కలవరపడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని చాలా వారధులు మూడు దశాబ్దాల క్రితం నిర్మించినవే. వాటిపై ఉన్న రక్షణ గోడలు ఏనాడో శిథిలావస్థకు చేరుకున్నాయి. జల్లేరు తరహా ఘటన ఇక్కడ జరగక ముందే యంత్రాంగం అప్రమత్తం కావాల్సి ఉంది. నగరంలోని ఏలూరు కాలువకు రెండు వైపులా ద్విచక్ర వాహనాలు, ఆటోలు మాత్రమే రాకపోకలు సాగించేందుకు మినీ వంతెనలను గతంలో నిర్మించారు. ఈ వంతెనలపై పర్యవేక్షణ కరువైంది. పాతబస్టాండ్ సెంటర్‌లోను, గూడ్స్ షెడ్డు రోడ్డులోను వంతెన మార్జిన్‌లు అధ్వానంగా తయారయ్యాయని, ఇప్పటికైనా వంతెనల వద్ద గోతులు పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ఫ్లైవోవర్‌పై ప్రమాదకరం

ఏలూరు నగరంలో జూట్ మిల్లు సెంటర్ నుంచి ఫైర్‌స్టేషన్ వరకు ఉన్న ఫ్లైవోవర్‌పై రక్షణ గోడలు, రెయిలింగ్స్ మూడు చోట్ల కూలి పోవడంతో ప్రయాణం ప్రమాద కరంగా మారింది. రెండేళ్ల క్రితమే ఈ రక్షణ గోడలు కూలినప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదు, కూటమి ప్రభుత్వం లోనైనా పాలకులు, అధికారులు చర్యలు తీసుకుని రక్షణ గోడలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



ఏలూరు ఫ్లైవోవర్‌పై కూలిన రెయిలింగ్

ప్రారంభం కాని రూ.3.50 కోట్లతో నిర్మించిన వంతెన

గణపవరం : తొమ్మిది దశాబ్దాల క్రితం బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో యనమదుర్రు డ్రెయిన్‌పై ఎస్.కొందేపాడు గ్రామం వద్ద నిర్మించిన లోలెవెల్ వంతెన ప్రజల పాలిట మృత్యుమార్గంగా మారింది. సపోర్టు వాల్స్ పూర్తిగా ధ్వంసమై ప్రమాదాలకు హేతువుగా తయారైంది. వర్షాకాలంలో లోలెవెల్ వంతెన పూర్తిగా యనమదుర్రు డ్రెయిన్‌లో మునిగిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో ఆరేళ్ల క్రితం ఎస్.కొందేపాడు వద్ద లో లెవెల్ వంతెన సరిహద్దులోనే నూతన వంతెన రూ.3కోట్ల 50లక్షలతో నిర్మించారు. ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడంతో ప్రజలకు ఉపయోగం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు నూతన వంతెన వాడుకలోకి తెచ్చేందుకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన నూతన వంతెనపై రాకపోకలు సాగించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అప్రోచ్ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామ సర్పంచ్ వీరలక్ష్మి మాట్లాడుతూ ప్రతీఏటా యనమదుర్రు వరదలో లోలెవెల్ వంతెన మునిగిపోతుంది. సపోర్టు వాల్స్ విరిగిపోవడంతో పలువురు నీటిలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు జరిగాయి. కొత్త వంతెనకు అప్రోచ్‌రోడ్డు నిర్మిస్తే సమస్య తీరుతుంది.



ప్రమాదకరంగా లోలెవెల్ వంతెన



ఎస్.కొందేపాడు ప్రారంభోత్సవానికి నోచుకోని రూ.3.50 కోట్లతో నిర్మించిన వంతెన

ఉండిలో ఇరుకు వంతెన సమస్య

నిత్యం వెంటాడుతున్న ట్రాఫిక్ సమస్య

ఉండి : ట్రాఫిక్‌మయం.. ప్రమాదాలకు వలయాలుగా ఇరుకు వంతెనలు మారుతున్నాయి. ఉండి పెదవంతెన సెంటర్‌లో పంట కాలువపై వున్న నాలుగు రోడ్ల కూడలిలో వున్న వంతెన ఇరుకువంతెన కావడంతో తరచూ ప్రమాదాలు, వాహనాలు ట్రాఫిక్‌లో నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ వంతెనపై ఉండి నుంచి భీమవరం, ఆకివీడు వైపు, ఏలూరు, విజయవాడ, గుడివాడ, మచిలీపట్నం, హైదరాబాద్, తిరుపతి ఇలా ప్రధాన ప్రాంతాలకు వాహనాలు వెళ్తుంటాయి. 2014, 2019లలో ఈవంతెన అభివృద్ధికి ప్రతిపాదనలు వెళ్లాయి. కానీ అభివృద్ధికి నోసుకోలేదు. వంతెనకు ఇరువైపుల గ్రిల్స్ పాడయ్యాయి. వాటిని తాత్కాలికంగా అభివృద్ధి చేశారు. వంతెన కింద పెచ్చులు ఊడుతున్నాయి. ఉండి-గణపవరం రహదారిలో మలుపు ప్రమాదకరంగా మారింది. ఈ ప్రాంతంలో వన్న కల్వర్టు శిథిలావస్థకు చేరింది. ఉండి శివారున సీతారామ థియేటర్ వద్ద ఉండి నుంచి వెలివర్రు వెళ్లే బొండాడ డ్రెయిన్‌పై వున్న వంతెన ఇరుకుగా వుంది. ఈప్రాంతంలో ఆక్వాచెరువులు సాగు ఎక్కువగా ఉండడంతో తరచూ వాహనాలు వచ్చి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ వంతెనను అభివృద్ధి చేయాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.





↑ ఉండి పెద్ద వంతెన సెంటర్‌లో తరచూ స్తంభిస్తున్న ట్రాఫిక్

← వంతెన కింద పెచ్చులూడుతున్న దృశ్యం

గుర్రాలవాగుపై వంతెన దుస్థితి..

కింద పైపులు పెట్టి పైన గ్రావెల్‌తో పూడ్చివేత

ద్వారకాతిరుమల : ఇదేదో గ్రావెల్ రోడ్డు అనుకుంటే మీరు తప్పులో కాలేసినట్టే.. గతంలో గుర్రాల వాగుపై నిర్మించిన వంతెన వైసీపీ హయాంలో మార్పు చెంది ఈవిధంగా తయారైంది. ద్వారకాతిరుమల మండలం రామన్నగూడెం పంచాయతీ దేవినేనివారిగూడెంలో గుర్రాల వాగుపై వంతెనను గత నాలుగేళ్ల క్రితం వరకు ఇక్కడ తారురోడ్డుతో వంతెన ఉండేది. అది గుర్రాల వాగు ఉధృతికి కొట్టుకుపోయి గండిలా పడింది. అప్పట్లో దానిని పునర్మించకుండా అధికారులు కింద పైపులు వేసి పైన పూడ్చివేసి ఆ తర్వాత గ్రావెల్ పోసి రోడ్డులా మార్పు చేశారు. కింద గుర్రాల వాగు నీరు ప్రవహిస్తున్నా సైడ్‌వాల్స్ లేకపోవడంతో గ్రామంలోని చెత్తాచెదారం అంతా దీని మార్జిన్‌లో పోసేస్తున్నారు. వాగు సులువుగా ప్రవహించేందుకు వీలు లేకుండా అందులో పిచ్చిమొక్కలు పెరిగిపోయినా పట్టించుకునే నాథుడే లేడు. ప్రస్తుతం ఈ రహదారి, వంతెన పూర్తిస్థాయి అభివృద్ధికి గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు నిధులు మంజూరు చేయించారు. త్వరలో పనులు ప్రారంభిస్తారు.

శిథిలావస్థలో గుమ్ములూరు, కోళ్లపర్రు వంతెనలు

ఆకివీడురూరల్ : ఆకివీడు మండలంలో రెండు వంతెనలు ప్రమాదకరంగా మాచాయి. గణపవరం-ఆకివీడు మధ్య గుమ్ములూరు లాకులు వద్ద పాతవ య్యేరుపై ఉన్న వంతెన రైలింగ్ విరిగింది. ఆకివీడు నుంచి కోళ్లపర్రు వెళ్లేందుకు చినకాపవరం డ్రెయిన్‌పై సుమారు 70 ఏళ్ల క్రితం నిర్మించిన ఇరుకు వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఒక వాహనం వెళితే మరో వాహనానికి చోటు ఉండదు. వంతెన ఎత్తు తక్కువలో నిర్మించడం వల్ల గుర్రపుడెక్క అడ్డుపడుతుంది. వరదల సమయంలో వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తుంది. ఈ వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.



రెయిలింగ్ ఊడిన కోళ్లపర్రు వంతెన దుస్థితి

ఎన్నికల హామీగా కోపల్లె వంతెన

టెండర్లు పిలిచినా ముందుకు రాని కాంట్రాక్టర్లు

కాళ్ల : పాలకులు మారుతున్నా.. ప్రభుత్వాలు మారుతున్నా దశాబ్దాలుగా ఉన్న కోపల్లె-జక్కరం వంతెనకు మోక్షం కలగడం లేదు. ఇరుకు వంతెనపై ప్రయాణికులు, వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల్లో గెలుపొందటానికి పలు హామీలు గుప్పించడం, ఆ తర్వాత మరచిపోవడం రాజకీయ పార్టీలకు సర్వసాధారణమైందని ప్రజలు బహిరంగ విమర్శలు చేస్తున్నారు. బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ వంతెన పునఃనిర్మాణానికి ఎంత మంది ఎమ్మెల్యేలు మారినా ఇచ్చిన హామీని నెరవేర్చలేకపోయారు. బొండాడ మురుగు డ్రెయిన్‌పై ఉన్న ఈ వంతెన శిథిలావస్థకు చేరడం, రక్షణ గోడలు లేకపోవడం, ఇరుకుగా ఉండడంతో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు గాలిలో కలిసిపోవాల్సిందే. భీమవరం నుంచి విజయవాడ వెళ్లేందుకు దగ్గర మార్గం కావడం, ఆక్వా రంగం బాగా విస్తరించడంతో ఈ వంతెనపై నుంచి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వంతెన నిర్మాణానికి రూ.12కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు చేపట్టలేదు. ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఆధ్వర్యంలో ఈ వంతెన నిర్మాణం జరుగుతుందని ఆయా గ్రామస్థులు ఎదురుచూస్తున్నారు.



రెయిలింగ్ విరిగి ప్రమాదకరంగా మారిన కోపల్లె వంతెన



శ్రీవారి దర్శనానికి క్యూలైన్లలో వెళ్తున్న భక్తులు

వెంకన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏడు కొండల వాడా.. వెంకటరమణా.. గోవిందా..గోవింద.. అంటూ వేలాదిగా భక్తులు చిన వెంకన్న క్షేత్రానికి చేరుకున్నారు. స్వామికి ఇష్టమైన రోజు శనివారం ద్వారకాతిరుమల ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు వేలాదిగా వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. శుక్రవారం సాయంత్రం నుంచే ఆలయానికి పాదయాత్ర భక్తుల రాక ప్రారంభమైంది. దాదాపు 18 వేల మంది వరకు భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. స్వామిని దర్శించిన భక్తులు అనంతర ఉచిత అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. స్వామివారి ఉచిత దర్శనానికి దాదాపు రెండు గంటల పైబడి సమయం పట్టింది.

శ్రీవారి సేవలో సినీ నటుడు గిరిధర్

చినవెంకన్న ఆలయాన్ని సినీ నటుడు గిరిధర్ శనివారం సందర్శించారు. ఆలయానికి వచ్చిన ఆయన ముందుగా స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆలయ పండితుల నుంచి వేదాశీర్వచనం, ప్రసాదాలను పొందారు. దర్శనానంతరం బయటకు వచ్చిన ఆయనను పలువురు భక్తులు గుర్తించి ఫొటోలు దిగారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో జన్మించిన ఆయన 1996లో వెంకటేశ్ హీరోగా నటించిన 'ప్రేమంటే ఇదేరా'తో వెండితెరపై తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 'స్వయంవరం, శ్రీను, నువ్వునాకు నచ్చావ్, అతడు, ఢీ, దుబాయ్ శ్రీను, లక్ష్యం, రెడీ, నమో వెంకటేశ, రగడ' వంటి పలు సినిమాల్లో నటించారు. తాజాగా డి.100 సినిమాలో నటించినట్టు ఆయన చెప్పారు.



చిన్నతిరుపతిలో అభిమానులతో నటుడు గిరిధర్



ప్రథమ ఉత్తమ లఘుచిత్రంగా నిలిచిన 'తుది శ్వాస' నిర్మాణ సారథులకు రూ.లక్ష చెక్కును అందిస్తున్న మంత్రి నిమ్మల



జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ముఖ్య సలహాదారు చేగొండి వెంకట హరిరామజోగయ్యకు సత్కారం

సమాజానికి మంచి సందేశాలిచ్చే వేదిక 'లఘు చిత్రాలు'

» మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు » ఘనంగా పాలకొల్లులో నాలుగో అంతర్జాతీయ లఘు చిత్రాల ప్రదర్శన పోటీలు

పాలకొల్లు అర్బన్‌/పాలకొల్లుటౌన్‌, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రజలను చైతన్యపరిచి రుగ్మతలను ఎత్తి చూపుతూ వాటి పరిష్కార దిశగా మంచి సందేశాలకు లఘు చిత్రాలు వేదికగా నిలుస్తాయని రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో శనివారం నాలుగో అంతర్జాతీయ లఘు చిత్రాల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు పరిషత్ గౌరవాధ్యక్షుడు మాజీ ఎంపీ చేగొండి వెంకట హరిరామజోగయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ ప్రతీ ఒక్కరిలో సామాజిక బాధ్యతను గుర్తు చేయడంతో పాటు వినోదాన్ని లఘుచిత్రాలు అందిస్తున్నాయన్నారు. నేటి యువతలో దాగి ఉన్నసృజనాత్మకతను, కొత్త ఆలోచనలను వెలికి తీసేందుకు లఘుచిత్రాలు దోహద పడతాయన్నారు. పాలకొల్లులో అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మితమవుతున్న బొండాడ వెంకట్రాజు గుప్త, ఎన్టీఆర్ కళాక్షేత్రం త్వరలో ప్రారంభించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో లఘు చిత్రాల పోటీలు నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. పరిషత్ జాతీయ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ లఘుచిత్రాల ప్రాముఖ్యతను వివరిస్తూ నాలుగేళ్ళుగా అంతర్జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా ఫిలిం నగర్ కల్చరల్ సెక్రటరీ చెరుకూరి శ్రీనివాసరాజును విశేష సేవాభూషణ్ పురస్కారం, ప్రముఖ సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణను విశేష ప్రతిభా పురస్కారం అందజేసి సత్కరించారు. సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేసిరాజు రాంప్రసాద్ సంస్థ కార్యకలాపాలను వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్, కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, ఉన్నమట్ల కపర్థి, సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, రాజేంద్ర కుమార్, పెన్మెత్స కోటి రామచంద్రరాజు తదితరులు ప్రసంగించారు కార్యక్రమ సంధాన కర్తలుగా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ పీఎన్ వర్మ, ఉపాధ్యక్షుడు గుడాల హరిబాబు, సంయుక్త కార్యదర్శి ఆర్‌వీ అప్పారావు ఏవీకే సుజాత, వంగా వంశీ వ్యవహరించారు. కార్యక్రమంలో ముత్యాల రామారావు, బొక్కా రమాకాంత్, సోమంచి శ్రీనివాస శాస్త్రి, గొర్ల శ్రీనివాస్, చవాకుల సూర్య నరేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ చిత్రంగా 'చివరి శ్వాస', సెకండ్ '733', థర్డ్ 'పదిలం'

అంతర్జాతీయ తెలుగు లఘు చిత్రాల ప్రదర్శన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన 'చివరి శ్వాస'కు లక్ష రూపాయలు దక్కింది. ద్వితీయ ఉత్తమ చిత్రంగా 733కి రూ. 75వేలు, తృతీయ ఉత్తమ చిత్రంగా 'పదిలం' ప్రదర్శనకు రూ.50వేలు లభించాయి. మొత్తం 12 లఘు చిత్రాలు ప్రదర్శనకు ఎంపికయ్యాయి. మిగిలిన తొమ్మిది చిత్రాలకు ఒక్కొక్కదానికి రూ. 5 వేలు నగదు, షీల్డు, ప్రశంసాపత్రం అందజేశారు. జ్యూరీ ప్రదర్శనలకు అనుమతించిన ఆరు చిత్రాలకు షీల్డు, ప్రశంసాపత్రం అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, వీర శంకర్, వీఎన్ ఆదిత్య, బీవీఎస్ రవి, సినీ గేయరచయిత సిరాశ్రీ, సమన్వయ కర్తగా రాజా వన్నెంరెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా సంస్థ ముఖ్యసలహాదారు, మాజీ ఎంపీ చేగొండి వెంకట హరిరామ జోగయ్యను ఘనంగా సత్కరించారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, హీరో సుమన్ సంస్థ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణంతో శ్రీవారి దర్శనం బాగుంది

» మహిళా ప్రయాణికుల అభిప్రాయం

ద్వారకాతిరుమలలో ఏలూరు జిల్లా ప్రజారవాణా శాఖ అధికారి షబ్నం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల బస్టాండ్‌ను ఏలూరు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎస్‌కే షబ్నం శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. బస్టాండ్ ప్రాంగణంలో మరుగుదొడ్ల పరిశుభ్రత, తాగు నీటి సౌకర్యాలను ఆమె పరిశీలించారు. బస్టాండ్‌లో ప్రయాణికులతో ఆమె మాట్లాడి లోటుపాట్లు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకంపై మహిళా ప్రయాణికుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా చాలా సంతోషంగా ఉందని ఉచిత ప్రయాణ సౌకర్యం ద్వారా తాము భీమవరం నుంచి వచ్చి స్వామిని దర్శించుకున్నామని ఆనందంతో చెప్పారు. బస్టాండ్‌లో సమకూర్చాల్సిన వసతులను ఆమె దృష్టికి స్థానికులు తీసుకెళ్లగా తగిన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఆమెతో పీఆర్‌వో నరసింహం పాల్గొన్నారు.



బస్టాండ్‌లో మహిళా ప్రయాణికులతో మాట్లాడుతున్న రవాణాశాఖ అధికారి షబ్నం



సాహస యాత్రలో పాల్గొన్న ఎన్‌సీసీ కేడేట్లు

ఒడిశా సాహస యాత్రలో 7 ఆంధ్రా కేడెట్లు

నరసాపురం,సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):ఒడిశాలోని చిలక ప్రాంతంలో నిర్వహిస్తున్న సైలింగ్ ఎక్స్‌పీరియన్స్ సాహస యాత్రలో పట్టణంలోని 7ఆంధ్రా ఎన్‌సీసీ నేవీ కేడేట్లు పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాల నుంచి సుమారు వంద మంది యాత్రలో పాల్గొన్నారు. ఇటువంటి సాహస యాత్రలు నిర్వహించడం వల్ల సైనిక శక్తిని సాహసాన్ని నింపుతుందని ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలాని అన్నారు. ఈ క్యాంపును గ్రూప్ కమాండర్ కల్నల్ నితిన్ అగర్వాల్, అనిల్‌మెహరా, సంజీత్ రౌత్రే సందర్శించి కేడేట్‌లకు పలు సూచనలు, సలహాలందించారు.

భీమవరం విష్ణు డిగ్రీ కళాశాలకు 'ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంక్'


ర్యాంకింగ్ సర్టిఫికెట్ అందుకుంటున్న విష్ణు కళాశాల అధ్యాపకులు

భీమవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): భీమవరం విష్ణు డిగ్రీ కళాశాలకు జాతీయ స్థాయిలో ర్యాంకు లభించింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ దేశంలో ఉన్నత విద్యా సంస్థలకు ప్రతిఏటా ర్యాంకింగ్‌లు ఇవ్వడానికి నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) వ్యవస్థను ఏర్పాటుచేసింది. అందులో రాష్ట్రంలోని ఐదు విద్యా సంస్థలు ర్యాంకింగ్ దక్కించుకున్నాయి. భీమవరం విష్ణు డిగ్రీ కళాశాలకు 200-301 ఫ్రేమ్ ర్యాంక్ జాతీయస్థాయిలో లభించింది. జాతీయ స్థాయిలో వేలాది డిగ్రీ కళాశాలలుంటే భీమవరం విష్ణు డిగ్రీ కళాశాలకు మంచి ర్యాంకు రావడంపై ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కేవీ స్వామి ప్రశంసించారు. విష్ణు డిగ్రీ కళాశాల జాతీయ స్థాయిలో ర్యాంకింగ్ సాధించడంలో కృషి చేసిన అధ్యాపకులు, సిబ్బందికి, సహకరించిన విద్యార్థులు, తల్లిదండ్రులకు విద్యా సంస్థల ఛైర్మన్ కేవీ విష్ణురాజు, వైస్ ఛైర్మన్ ఆర్.రవిచంద్రన్, కార్యదర్శి ఆదిత్య విస్సం, జాయింట్ కార్యదర్శి కె.సాయిసుమంత్ అభినందించారు.

11,12 తేదీల్లో ఉమ్మడి జిల్లా కళాఉత్సవ్ పోటీలు

ఏలూరుఅర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని 48 మండలాలకు చెందిన ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో తొమ్మిదో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు చదువుతున్న బాల బాలికలకు ఈ నెల 11, 12 తేదీల్లో జిల్లాస్థాయి కళాఉత్సవ్-2025 పోటీలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.కమలకుమారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దూబచర్లలోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో 11న సంగీ తం, నృత్యం పోటీలు, 12న నాటకం, డ్రాయింగ్, కథచెప్పడం వంటి అంశా ల్లో వ్యక్తిగత, గ్రూపు విభాగాల్లో ఉదయం 10 గంటల నుంచి పోటీలు జరుగుతాయన్నారు. ప్రతీ అంశం పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. వివరాలు, ముందస్తు రిజిస్ట్రేషన్ల కోసం డైట్ లెక్చరర్లు రాజ్‌కుమార్ 89195 59615, శామ్యూల్ 99123 08303 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇగ్నో కోర్సుల్లో ప్రవేశాలకు గడువు 15

ఏలూరుఅర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)లో జూలై-2025బ్యాచ్ డిప్లొమా, పీజీ డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని స్థానిక సీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు, ఇగ్నో స్టడీసెంటర్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు తెలిపారు. యూనివర్సిటీ వెబ్‌సైట్ అడ్మిషన్ల లింక్‌ద్వారా నిర్ణీత ఫీజు చెల్లించి ఈనెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసుకోవాలన్నారు. వివరాలకు స్టడీ సెంటర్ 94903 30469 నంబరులో సంప్రదించాలని సూచించారు.

బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శ్రీపద్మ


కొలచన శ్రీపద్మ

నరసాపురం టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నరసాపురం ప్రాంతానికి కూటమి ప్రభుత్వం మరో డైరెక్టర్ పదవిని కట్టబెట్టింది. బ్రాహ్మణ వెల్ఫేర్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన కొలచన శ్రీపద్మను నియమించారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఆమె పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఆమెను విప్ నాయకర్, మైనార్టీ సలహాదారు ఏంఏ షరీఫ్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొవ్వలి నాయుడు, మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏఎంసీ ఛైర్మన్ జక్కం శ్రీమన్నా రాయణ, కొప్పాడ రవి, వాతాడి ఉమా, శశిదేవి, శ్రీదేవి, చిన్నామమ్మ, సునీత, ఈశ్వరి అభినందనలు తెలిపారు.

ఏలూరు ఎంపీడీవో శ్రీలతకు పదోన్నతి బదిలీ


వెన్నా శ్రీలత


ఏలూరురూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏలూరు ఎంపీడీవో వెన్నా శ్రీలతకు ఇటీవల పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన ఎంపీడీవోలకు పోస్టింగులు కేటాయిస్తూ పంచాయతీ రాజ్‌శాఖ కమిషనర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెకు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో డ్వామా ఏవోగా పోస్టింగ్ అందించారు. గత ఏడాది ఏలూరు మండలం ఎంపడీవోగా బాధ్యతలు చేపట్టిన ఆమె మండలాభివృద్ధికి కృషి చేశారు. ఇటీవల రాష్ట్రప్రభుత్వం ఎంపీడీవోలకు పదోన్నతి కల్పించింది.

కోర్టు హాలులో 'కోడె నాగు' హల్‌చల్


కోడె నాగును పట్టుకున్న స్నేక్ సేవర్

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డి గూడెం పట్టణంలోని కోర్టు చాంబర్‌లోకి శనివారం ఏడడుగుల కోడెనాగు ప్రవేశించింది. భయాందోళనకు గురైన సిబ్బంది సమాచారం మేరకు స్థానిక స్నేక్ సేవర్ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ క్రాంతి అక్కడకు చేరుకుని పామును పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్.కిషోర్‌కుమార్ పామును పట్టుకున్న క్రాంతిని అభినందించారు.

తాటియాకులగూడెం హైవేపై 'కొండ చిలువ'



జీలుగుమిల్లి,సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తాటియాకుల గూడెం ఆంధ్ర- తెలంగాణ సరిహద్దు ప్రాంతంలోని హైవేపై కొండచిలువ కనిపించింది. శనివారం రాత్రి సుమారు పది అడుగుల కొండచిలువ రోడ్డు దాటింది. ఆ సమయంలో పలువురు రహదారిపై వెళ్లే వాహన చోదకులు ట్రాఫిక్ నిలుపుదల చేసి కొండచిలువ వెళ్లే వరకు వేచి ఉన్నారు. కొండచిలువ కొద్దిసేపు కన్పించినా దాన్ని హతమార్చేందుకు ఎవరూ ప్రయత్నించక పోవడంతో పర్యావరణ ప్రేమికులు, వాహన చోదకులు దాన్ని వీక్షిస్తూ సంతృప్తి పొందారు.

కొబ్బరి అధరహో!



» ఆల్ టైం రికార్డ్ ధరతో రైతులు, వ్యాపారుల్లో జోష్

» వెయ్యి కాయల ధర పశ్చిమలో రూ.23 వేలు.. తూర్పులో రూ. 25వేలు

» రెట్టింపైన ఎగుమతులు

కొబ్బరి ధర ఆల్ టైం రికార్డు నెలకొల్పింది. దీంతో ఇటు రైతులు, అటు వ్యాపారులు జోష్‌లో ఉన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వెయ్యి కాయల ధర గరిష్ఠంగా రూ.23 వేలు ఉండగా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.25 వేలు పలుకుతోంది. అలాగే కురిడీ ధర సైతం మునుపెన్నడూ లేని రీతిలో రూ. 33 వేలకు చేరింది. గణపతి నవరాత్రులు ముగిసినప్పటికీ, రానున్న దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో కొబ్బరి ధర ఇలాగే కొనసాగే అవకాశాలు మెండుగా ఉన్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. దీంతో ఉభయ గోదావరి జిల్లాల్లో కొబ్బరికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది.

యలమంచిలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గడచిన 40 ఏళ్లలో కొబ్బరికి ఇంత ధర పలకడం తామెన్నడూ ఎరుగమని సీనియర్ సిటిజన్స్ చెబుతున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో కొబ్బరి దిగుబడి తక్కువగానే ఉన్నప్పటికీ ధర బాగుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గడచిన నాలుగేళ్లలో కొబ్బరి ధర, దిగుబడి అంతంతమాత్రంగా ఉండటంతో కొబ్బరి సాగుకు రైతులు అంతగా ఆసక్తి కనబరిచేవారు కాదు. ఇప్పుడు కొబ్బరి ధర పెరగడంతో రైతులు కొబ్బరిసాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. అయితే కొబ్బరి చెట్లకు పెట్టేందుకు యూరియా సకాలంలో దొరకక రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

రెట్టింపైన ఎగుమతులు..

ఉభయ గోదావరి జిల్లాల నుంచి తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఇంకా పలు ఉత్తరాది రాష్ట్రాలకు కొబ్బరికాయలు ఎగుమతులు అవుతాయి. తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడి తగ్గడంతో ఉభయగోదావరి జిల్లాల కొబ్బరికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఉభయగోదావరి జిల్లాల నుంచి ముఖ్యంగా కోనసీమ, పాలకొల్లు ప్రాంతాల నుంచి ప్రతి రోజూ సుమారు 70 నుంచి 90 లారీల కొబ్బరి ఎగుమతి అవుతుండేది. డిమాండ్ నేపథ్యంలో ప్రస్తుతం ఈ ప్రాంతాల నుంచి సుమారు 150 పైబడి లారీల కొబ్బరి ఎగుమతులు అవుతున్నాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. బిహార్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో దీపావళి పండుగకు జరుపుకునే చట్ పూజకు కొబ్బరిని ఎక్కువగా వినియోగిస్తారు. ఈ రాష్ట్రాల కు నీటి బొండాలను నేరుగా ఎగుమతి చేస్తారు. ఈ బొండాల ఎగుమతులు గత నెలలో ప్రారంభమయ్యాయి. రానున్న రెండు నెలల్లో బొండాల ఎగుమతులు మరింత పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. సాధారణంగా వినాయక చవితి, దసరా, దీపావళి, కార్తీక మాసం సీజన్లలో కొబ్బరికి డిమాండ్ ఉంటుంది. 2026 జనవరి నెలలో మేడారం జాతర తేదీలను ఖరారు చేయడంతో జనవరి వరకూ కొబ్బరి మార్కెట్ ఆశాజనకంగానూ, నిలకడగానూ ఉంటుందని అంచనాలు వేస్తున్నారు.

పెరిగిన ధరలిలా..

ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్న కొబ్బరికాయలు రాయపూర్ సీల్ వెయ్యి కాయలు రూ.30 వేలు, పెద్దకాయ రూ.28 వేలు, 60లు రూ.28వేలు, ఢిల్లీ క్వాలిటీ ధర రూ.25 వేలు, 70లు రూ.20వేలు పలుకుతున్నాయి. కురిడీ కాయల్లో గండేరా రకం ధర రూ.33 వేలు, గటగటా రకం ధర రూ.30 వేలు ఉంది.

వ్యాపారుల్లో ఉత్సాహం



గత 30 ఏళ్లలో కొబ్బరికి ఇంత డిమాండ్ రావడం ఇదే తొలిసారి. దీంతో పాటు ఎగుమతులు ఊపందుకోవడంతో వ్యాపారుల్లో ఉత్సాహం నెలకొంది. ఎగుమతులు రెట్టింపయ్యాయి. ధరలు నిలకడగా ఉంటే రైతులకు, వ్యాపారులతోపాటు, కొబ్బరి కార్మికులకు మేలు జరుగుతుంది. దసరా, దీపావళి పండుగలకు ప్రతి ఏటా కొబ్బరికి డిమాండ్ ఉంటుంది. కనీసం రెండు నెలలు కొబ్బరి మార్కెట్ నిలకడగా ఉండే అవకాశం ఉంది.

- కాసా సత్య, కొబ్బరి వ్యాపారి, యలమంచిలి.

సాగుపై పెరిగిన ఆసక్తి



మునుపెన్నడూ లేని స్థాయికి కొబ్బరి ధర పెరగడంతో రైతుల్లో జోష్ నెలకొంది. గడచిన మూడేళ్లలో కొబ్బరి ధరలు తక్కువగా ఉండటం.. దిగుబడి 50 శాతానికి పడిపోవడంతో దింపు కార్మికులకు, కూలీలకు సొమ్ములు చెల్లించగా ఏమీ మిగలని పరిస్థితుల్ని ఎదుర్కొన్నాం. ఇప్పుడు కొబ్బరి ధర పెరగడంతో కొబ్బరి సాగుపై రైతుల్లో ఆసక్తి రెట్టింపు అయ్యింది. దిగుబడులు ఆశించిన స్థాయిలో లేనప్పటికీ రేటు పెరగడంతో రైతులు సంతృప్తిగా ఉన్నారు.

- శనగళ్ల శ్రీనివాస్, కొబ్బరి రైతు, యలమంచిలి.



బాలలకు వసతులు కల్పించండి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): చట్టంతో విభేదించిన బాలలకు సరైన మౌలిక సదుపా యాలు కల్పించి విద్యను అందిస్తే ఉత్తమ పౌరులుగా వెలుగొందుతారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శ్రీదేవి సూచించారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఏ భవనంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ ఆ బాలలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వారికి ఏర్పాటు చేసిన వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు క్రమశిక్షణతో పాటు విద్యను అందించాలని సూచించారు. ప్రభుత్వం వారికి ప్రవేశపెట్టిన పథకాలు అందుతున్నాయో లేదో ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. నేటి బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లాలో బాధితులకు పరిహారం చెల్లించాల్సి ఉందని అలాగే బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలను నిరోధించడానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. పోక్సో కోర్టు స్పెషల్ జడ్జ్ కె. వాణిశ్రీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బులికృష్ణ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన ఆర్టీసీ బస్సు.. ప్రయాణికుల పాట్లు

ఆకివీడు సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):నర్సాపురం డిపో ఆర్టీసీ బస్ ఫ్యాన్ బెల్ట్ తెగి శుక్రవారం రాత్రి నుంచి ఆకివీడు బస్టాండ్‌లో నిలిచిపోయింది. నర్సాపురం నుంచి ఆకివీడు మీదుగా ఏలూరు రాకపోకలు సాగించే బస్సులు అంతంత మాత్రంగా ఉన్నాయి. ఇలా బస్సులు చెడిపోయి రోజంతా బస్టాండ్‌లో నిలిచిపోతే ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి నుంచి గుడివాడ, విజయవాడకు బస్సులు లేవు. ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ఏర్పాటుతో మహిళలు అధికంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. బస్సులు సరిపడినంత లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

యూరియా కొరత లేదు

తణుకు రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తణుకు నియోజకవర్గంలోని రైతులకు యూరియా కొరత లేదని తణుకు వ్యవసాయ శాఖ ఉప సంచాలకుడు జి.నరేంద్ర తెలిపారు. శనివారం ఆయన తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో పలు సొసైటీలు, ప్రైవేట్ ఎరువుల షాపుల ను పరిశీలించి మాట్లాడుతూ సొసైటీల వద్ద 33.445 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ షాపుల వద్ద 44.47 మెట్రిక్ టన్ను యూరియా అందుబాటులో ఉందన్నారు. తణుకు మండల వ్యవసాయాధికారి కె.రాజేంద్రప్రసాద్, ఇరగవరం, అత్తిలి మండలాల వ్యవసాయాధి కారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా అమ్మకాల్లో నిబంధనాలు?

» కుక్కునూరులో కాంప్లెక్స్ ఎరువు కొంటేనే యూరియా

» 2 యూరియా బస్తాలకు ఒక కాంప్లెక్స్ ఎరువు బస్తా కొనాల్సిందే

» 2 బస్తాల యూరియా రూ. 534 » కాంప్లెక్స్ బస్తా రూ.1086

కుక్కునూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):కుక్కునూరులోని మన గ్రోమోర్ ఎరువుల దుకాణానికి శనివారం యూరియా రావడంతో యూరియా కోసం వెళ్లిన రైతులకు సిబ్బంది నిబంధనలు విధించారు. ఒక్కో రైతుకు రెండు యూరియా బస్తాలు ఇవ్వాలి అంటే మన గ్రోమోర్ తయారీ అయిన ఎఫ్-20 అనే కాంప్లెక్స్ ఎరువు కొనుగోలు చెయ్యాలి. అంటే రెండు యూరియా బస్తాలు ఒక్కొక్కటి రూ. 267 చొప్పున రూ. 534 చెల్లించి కొనుగోలు చేస్తే రైతులకు అవసరం లేకున్నా ఎఫ్-20 అనే కాంప్లెక్స్ ఎరువు రూ. 1086కి తప్పనిసరిగా చెల్లించి కొనుగోలు చెయ్యాలి. ఈ నిబంధనతో పలువురు రైతులు యూరియా కొనుగోలు చెయ్యలేక వెనుతిరిగి వెళ్లిపోగా మరికొందరు తప్పని పరిస్థితులలో కాంప్లెక్స్ ఎరువు కొనుగోలు చేశారు. యూరియా డిమాండ్‌ను ఆసరా చేసుకుని కాంప్లెక్స్ ఎరువును అంటగట్టడంపై పలువురు రైతులు వాగ్వాదానికి దిగారు. వ్యవసాయ శాఖ సిబ్బంది సమక్షంలోనే యూరియా ఇలా పంపిణీ జరగడంతో కొందరు రైతులు మండి పడుతున్నారు. అలాగే ముంపు పరిహారం అందించిన భూముల్లో వేసిన పంటలకు యూరియా ఇవ్వం అని ముంపులో లేని భూముల్లో వేసి ఈ-క్రాప్ నమోదు చేసిన పంటలకు మాత్రమే యూరియా ఇస్తామని కూడా నిబంధన విధించారు.

సైబర్ నేరగాళ్ల వలలో రిటైర్డ్ హెచ్‌ఎం

దఫదఫాలుగా రూ.42 లక్షల 50 వేలు స్వాహా

ఏలూరు క్రైం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడిని సైబర్ నేరగాళ్లు బెదిరించి అకౌంట్ నుంచి రూ.42 లక్షల 50 వేలు తస్కరించారు. హేలాపురి టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న యార్లగడ్డ రాఘవేంద్రరావు(65)కు గత నెల 28న సైబర్ నేరగాళ్లు వాట్సాప్ కాల్స్ చేసి ఆడపిల్లలపై అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నారంటూ బెదిరింపులకు దిగారు. విజయవాడ గవర్నర్‌పేటలో కేసు నమోదైందని, ఆధార్ కార్డు పెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం మొదటి దఫాగా రాఘవేంద్రరావు అకౌంట్ నుంచి రూ.26 లక్షల నగదు వారి అకౌంట్‌కు వేయించుకున్నారు. దఫదఫాలుగా రూ.42 లక్షల 50 వేలు ఆన్‌లైన్ ద్వారా మూడు అకౌంట్లకు బదిలీ చేయించుకున్నారు. అనంతరం మోసపోయానని రాఘవేంద్రరావు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మూడ్రోజులు క్రితం నూతిరామన్నపాలెం సమీపంలో రోడ్డు పక్కన పడి ఉన్న వ్యక్తిని కొంతమంది మానవతా దృక్పథంతో బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్యకేంద్రంలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం మరణించడంతో సమాచారం అందుకున్న పోలీసులు సంబంధిత వ్యక్తి కోసం ఆరా తీస్తున్నారు.

రిమాండ్ ఖైదీ మృతిపై రేపు విచారణ

భీమవరంటౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గణపవరం మండలం చిన్న రామచంద్రాపురం గ్రామానికి యాళ్ల సాయి కిశోర్ ఏలూరు జిల్లా జైల్లో రిమాండ్‌గా ఉన్న సమయంలో అనారోగ్యానికి గురవ్వడంతో విజయవాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అక్కడ మృతి చెందాడు. సాయికిశోర్ మృతిపై భీమవరం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి 8వ తేదీన విచారణ చేపట్టనున్నారు. ఏమైనా ఆధారాలుంటే తీసుకుని ఉదయం 11 గంటలకు భీమవరం ఆర్డీవో కార్యాలయానికి రావాలని సూచించారు. వివరాల్లోకి వెళితే.. పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం, చిన్న రామ చంద్రాపురం గ్రామానికి చెందిన యాళ్ల సాయి కిశోర్ ఏలూరు జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సమయంలో 2025 జూన్ 11న వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. తీవ్రమైన జ్వరం రావడంతో అదేరోజు ఉదయం విజయవాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం 5.30 గంటలకు మరణించినట్టు విజయవాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి డ్యూటీ డాక్టర్ ప్రకటించారని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఏమైనా ఆధారాలుంటే ఆర్డీవో కార్యాలయానికి రావాలని సూచించారు.

గురుకుల ప్రిన్సిపల్ రాజారావు సస్పెన్షన్

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):పాఠశాల జరుగుతున్న సమయంలో బాధ్యతా రాహిత్యంగా సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ బ్యాక్ పైపర్ బ్యాండ్ విద్యార్థుల బృందాన్ని నరసాపురం ప్రైవేటు కళాశాలకు పంపడంపై ప్రిన్సిపల్ బి.రాజారావును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. అదే విధంగా ఈ ఘటనపై జిల్లా కో ఆర్డినేటర్ ఉమాకుమారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాల్సిందిగా ఆదేశించారు.

నేలబావిలో పడి వ్యక్తి మృతి

ముసునూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పొలంలో వ్యవసాయ పని చేస్తూ ప్రమాదవశాత్తు నేలబావిలో పడి వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని అన్నపనేనివారిగూడేనికి చెందిన ఉమ్మడి కిషోర్(30) శుక్రవారం తన పొలంలో ఉన్న నేలబావి చుట్టు జంగిల్‌ను శుభ్రం చేస్తున్న క్రమంలో బావిలో పడిపోయాడు. రాత్రి వరకు కిషోర్ ఇంటికి రాకపోవడంతో పోలీసులు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఎం.చిరంజీవి గాలించగా నేలబావిలో ఉన్న చెత్తలో చిక్కుకుపోయి కిశోర్ మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

దొంగనోట్ల ముఠా అరెస్టు


నిందితులను అదుపులోకి తీసుకున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అమాయకులను నమ్మించి మోసగిస్తున్న నకిలీ నోట్ల ముఠాను పట్టుకున్నట్టు సీఐ ఎం.వి.సుభాశ్ శనివారం తెలిపారు.ఈనెల 5వ తేదీ శుక్రవారం జంగారెడ్డిగూడెం పట్టణ శివారులోని బాట గంగానమ్మ లే అవుట్ కాలనీ సమీపంలో గోపాలపురం గ్రామానికి చెందిన ఏలేటి చంద్రశేఖర్, జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన లాగు శ్రీను,జంగారెడ్డిగూడెం మండలం నాగులగూడెం గ్రామానికి చెందిన మోత్రపు వంశీ కుమార్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ సందర్భంగా సీఐ సుభాశ్ మాట్లాడుతూ నల్లరంగులో కాగితాలు ఒక ప్రత్యేక ద్రావణంలో ముంచితే అసలైన నోటుగా మారుతుందంటూ అమాయకులను నమ్మించి మోసగిస్తున్నారని అన్నారు. ప్రజలు ఇటువంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిందితుల నుంచి చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ముద్రించిన ఐదు వందల నోట్లు 255, నకిలీ ఐదు వందల నల్ల నోట్లు పది, రూ.50 వేల నగదు, రసాయన ద్రావణం సీసా, ద్విచక్ర వాహనం స్వాధీ నం చేసుకుని ముగ్గురు నిందితులను రిమాండుకు తరలించినట్టు తెలిపారు. నకిలీ నోట్ల ముఠాను పట్టుకున్న సీఐ సుభాశ్, ఎస్.ఐ. జబీర్‌లను డీఎస్పీ రవి చంద్ర అభినందించారు.

వ్యాను బోల్తా..15 మందికి గాయాలు


ఏలూరు సమీపంలో బోల్తాకొట్టిన వ్యాను

ఏలూరు క్రైం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వెళ్తున్న వ్యాను టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి బోల్తా కొట్టడంతో వ్యానులో ఉన్న 15మంది తీవ్రంగా గాయపడ్డారు. అనకాపల్లి జిల్లా కొట్టాయిపేట మండలం, గ్రామానికి చెందిన 15 మంది ఈ ఏడాది జులై 15న కడప జిల్లా బద్వేలు వెళ్లి అక్కడ పెన్నానదిలో చేపల వేట నిర్వహించి తిరిగి తమ గ్రామానికి రావడానికి మేరుగు అప్పలరాజు వ్యాను మాట్లాడుకున్నారు. మార్గమధ్యలో శనివారం ఉదయం 6 గంటల సమయంలో ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ ఏలూరు ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో వ్యాను చక్రానికి పంక్చర్ అవడంతో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యానులో ఉన్న 15 మందికి తీవ్ర గాయాలవడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం తమ ప్రాంతానికి తీసుకెళ్లిపోయారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ప్లాట్‌ఫామ్‌పై కుప్పకూలి వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఒక వృద్ధుడు రైలు దిగి ప్లాట్‌ఫామ్‌పై ఫోను మాట్లాడుతూ నడుచుకుంటూ వెళ్తుండగా అకస్మాత్తుగా కుప్పకూలిపడిపోయి మృతి చెందాడు. ఈ సంఘటన ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో శనివారం సాయంత్రం జరిగింది. ఏలూరు రూరల్ మండలం సాయి నగర్‌కు చెందిన సందిపర్తి బాబూరావు(63)కు తునిలో పొలం ఉండడంతో రైల్లో వెళ్లి పొలం చూసుకుని తిరిగి శనివారం సాయంత్రం ఏలూరు రైల్వే స్టేషన్‌లో రైలు దిగాడు. ఫోను మాట్లాడుతూ ప్లాట్‌పై నడుస్తూ అకస్మాత్తుగా కుప్పకూలిపడిపోయి నోటి వెంబడి రక్తం వచ్చింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు 108అంబులెన్సును రప్పించగా అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ సంఘటనపై ఏలూరు రైల్వే పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. అయితే బాబూరావు ప్లాట్‌ఫారమ్ పై ఫోను మాట్లాడుతుండగా హైటెన్షన్ విద్యుత్ వైరు వల్ల సెల్‌ఫోన్ సిగ్నల్‌కు విద్యుత్ ప్రవాహం జరిగి మరణించారా లేదా గుండెపోటు వల్ల మరణించారా మరే ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వసతి గృహాలు తరలించొద్దు


దీక్షలు చేస్తున్న సీపీఐ నాయకులు

కొయ్యలగూడెం, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): కొయ్యలగూ డెంలో ఉన్న బీసీ బాలుర వసతి గృహాలను వేరే మండలాలకు తరలించవద్దంటూ తలపెట్టిన నిరసన దీక్షలు 3వ రోజుకు చేరాయి. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లా డుతూ దశాబ్దాల కాలం నుంచి బీసీ వసతి గృహాలు కొయ్యలగూడెంలో కొనసాగుతున్నాయన్నారు. ఈ వసతి గృహాలను బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాలకు తరలించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.

పశువుల మాంసం తరలించే లారీ పట్టివేత

జీలుగుమిల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పశువుల మాంసం తరలిస్తున్న లారీని జీలుగుమిల్లిలో పోలీసులు పట్టుకున్నారు. జాతీయ రహదారి హెచ్‌పీ గ్యాస్ గొడౌన్ సమీపంలో రహదారిపై వస్తున్న లారీని శనివారం ఎస్.ఐ. వి.క్రాంతి కుమార్ అనుమానం వచ్చి పరిశీలించగా పశువుల మాంసం తరలిస్తున్నట్టు తెలిసింది. కలకత్తా నుంచి హైదరాబాద్‌కు మాంసం తరలిస్తున్నట్టు గుర్తించారు. ఇద్దరు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ. చెప్పారు. లారీలో ఐస్ వేసి పాడవకుండా మాంసం తరలిస్తున్నారు. 12 టన్నులు లోడుతో వెళ్తున్న లారీ విలువ సుమారు రూ.20 లక్షలు వరకు ఉటుందన్నారు. వీఆర్వో రామతులసి, పశు వైద్య సహాయ సంచాలకులు సాయిబుచ్చారావు ఆధ్వర్యంలో పరిశీలించి కేసు నమోదు చేశారు. ఆ మాంసాన్ని ఎక్స్‌కవేటర్ సాయంతో గొయ్యి తీసి పూడ్చిపెట్టారు.

మల్లవరం లంకలో హైటెన్షన్

నరసాపురం రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లవరం లంక గ్రామంలో శనివారం హైటెన్షన్ వాతావరణం నెలకొంది. రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదం రచ్చగా మారింది. గ్రామంలోని చెరువు గట్టు వద్ద ఒక వర్గానికి చెందిన వారు చాలా కాలంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. శనివారం కొందరు వీటికి అంతరాయం కలిగిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వీటిని తొలగించాలని ఒక వర్గం కొరగా ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రెవెన్యూ సిబ్బంది గ్రామానికి విచ్చేశారు. ఇరువర్గాల పెద్దలతో చర్చించి తాత్కాలికంగా ఫ్లెక్సీలు తీయించారు. ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. రూరల్ సీఐ దుర్గాప్రసాద్, ఎస్.ఐ. వెంకట సురేశ్‌లు పర్యవేక్షిస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): భార్య మరణించిందని మానసిక ఆందోళనకు గురై చివరకు జీవితంపై విరక్తి చెంది పురుగుమందు తాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక వృద్ధుడు శనివారం ఉదయం మృతి చెందాడు. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం వాకలగరువు గ్రామానికి చెందిన గుడాల రాఘవులు(70) భార్య ఏడాది క్రితం మరణించింది. అప్పటి నుంచి మానసిక ఆందోళనతో వేదనకు గురవుతున్నాడు. చివరకు జీవితంపై విరక్తి చెంది ఈ నెల 6వ తేదీ రాత్రి పురుగు మందుతాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం తణుకు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా శనివారం ఉదయం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారమిచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

● గోతులతో నరకం



నిడమర్రు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):నిడమర్రు నుంచి మందలపర్రు మీదుగా భువ్వనపల్లి వెళ్లే ప్రధాన రహదారి గోతులమ యంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. శనివారం ఉదయం చిన్న ఆటో అడుగులోతు గొయ్యిలో దిగబడటంతో బయటకు లాగడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

శ్రీవారి సన్నిధిలో అర్చనలు, హోమాలు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): భాద్రపదమాసంలోని శనివారం కావడం, ఆదివారం చంద్రగ్రహణం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిశాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు, వేద పండితులు యనమండ్ర అవధానులు, పవన్ వెంకట కృష్ణమాచార్యులు హోమాలు జరిపించారు. ఆలయ ఈవో నల్లూరి సతీశ్ కుమార్, సిబ్బంది గల్లా శ్రీనివాసరావు, పామర్తి గంగాధరరావు బృందం భక్తులకు తగు సేవలు అందించారు.

3,225 రకాల వ్యాధులకు ఉచితంగా సేవలు

కొయ్యలగూడెం, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవలో 3,225రకాల వ్యాధులకు ఉచితంగా సర్జరీలు చేస్తున్నట్టు ఎన్టీఆర్ వైద్య సేవా డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రాజీవ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మండలంలోని బయ్యన్నగూడెం పీహెచ్‌సీని పరిశీలించారు. రోగి ఆసుపత్రి నుంచి వెళ్లాక కూడా పది రోజులకు మందులు ఇవ్వడమే కాక బస్సు చార్జీలు కూడా ఇస్తూ నాణ్యమైన సేవలందేలా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎన్టీఆర్ వైద్యసేవా కార్డు కుటుంబానికి రూ.5 లక్షల వరకు వైద్యసేవలు అందుతాయని తెలిపారు. చెవిటి, మూగ సమస్యలతో పుట్టిన వారికి రూ.12 లక్షల వరకు, క్యాన్సర్ రోగులకు అపరిమితమైన వైద్యం అందిస్తారని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు లేనివారు అనారోగ్యానికి గురైతే నెట్‌వర్క్ ఆసుపత్రికి వెళ్లి ఆరోగ్యమిత్రను సంప్రదించాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ వీ.సత్యనారాయణ, ఆరోగ్య విస్తర్ణాధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్లు ఛాన్ భాష, బుజ్జి ఉన్నారు.

తెలంగాణలో జీపీవోల నియామకంపై హర్షం

ఏలూరు రూరల్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం చేసే క్రమంలో మొదటి విడతలో గ్రామ స్థాయిలో 5వేల మందికి జీపీవోలుగా నియామక ఉత్తర్వులివ్వడం పట్ల ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి గ్రామానికి ఒక పరిపాలన అధికారిని నియమించడం, తద్వారా రెవెన్యూ సేవలు గ్రామాల్లో రైతులకు, ప్రజలకు పారదర్శకంగా పనిచేయడానికి ఉపయోగపడుతుందన్నారు.

బెయేర్నెబా మినిస్ట్రీస్‌లో ఉపవాస ఆరాధన

దెందులూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సోమవరప్పాడు పంచాయతీ పరిధిలోని వీరభద్రాపురం గ్రామంలో ఉన్న బెయేర్నెబా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బ్రదర్ సాల్మన్‌రాజు ఉపవాస ఆరాధన కార్యక్రమం శనివారం ప్రారంభించారు. ఈ ప్రార్థనల్లో జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు పాల్గొని జయప్రదం చేశారు. దీంతో జగన్నాథపురం, కవ్వగుంట, ఏలూరుతో పలుచోట్ల ఆదివారం కూడా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలను విద్యార్థులు, రైతులు, అన్ని వర్గాల ప్రజల కోసం ఉపవాస ఆరాధన ప్రార్థనలు చేపట్టారు. సంఘ విశ్వాసులు, సంఘ పెద్దలు, కన్యకశ్రీలు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నివారణపై విద్యార్థులకు అవగాహన

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ నివారణపై స్థానిక కస్తూరిబా మున్సిపల్ హైస్కూల్లో శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ వ్యాప్తి, లక్షణాలు, ముందస్తు జాగ్రత్తలు, చికిత్స, తదితర అంశాలపై డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం, ఎన్‌సీడీ విభాగం జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ నరేంద్రకృష్ణ వివరించారు. సంస్థ ప్రతినిధులు శిరీష, రాజేంద్ర ప్రసాద్, ఏఎన్ఎం ప్రభావతి పాల్గొన్నారు.

అటవీ శాఖ పరీక్షల ఏర్పాట్ల పరిశీలన

దెందులూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖలో బీట్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ల ఉద్యోగాలకు జరిగే పరీక్షలకు గొపన్నపాలెం పంచాయతీ పరిధిలో వేగవరం హేలాపురి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆఫ్ సైన్సెస్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని తహసీల్దార్ బత్తుల సుమతి, డిప్యూటీ తహసీల్దార్ అంతర్వేది శ్రీనివాస్‌లు శనివారం పరిశీలించారు. ఈ కేంద్రంలో ఆదివారం 600 మంది పరీక్షలు రాస్తున్నారని, అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేశామని తెలిపారు.

వైద్యుడు శ్రీనివాసరావుకు ఉద్యోగ విరమణ సత్కారం



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వైద్యుడు పోతుమూడి శ్రీనివాస రావు అంకితభావంతో నిస్వార్థంగా ఎంతో మందికి వైద్య సేవలందించారని ఎమ్మెల్యే బడేటి చంటి, మాజీ డీసీహెచ్ఎస్ సీనియర్ డాక్టర్ ఏవీఆర్ మోహన్ అన్నారు. ప్రభుత్వ వైద్యులు శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ నేపథ్యంలో సారథి కల్యాణ మండపంలో శనివారం రాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున వైద్యులు, నగర ప్రముఖులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ డాక్టర్ శ్రీనివాసరావు ఎక్కడ పనిచేసినా రోగులకు మెరుగైన వైద్యం అందించారన్నారు. కోవిడ్ సమయంలో ఏలూరు సర్వజన ఆసుపత్రి కోవిడ్ ఇన్‌ఛార్జిగా సమర్థ సేవలందించారని అప్పట్లో ఏలూరు ఆసుపత్రికి కోవిడ్‌కు రాష్ట్ర స్థాయిలోనే మంచి వైద్యం అందించారనే ప్రశంసలు కూడా వచ్చాయని దీనిలో ఈయన కీలక పాత్ర వహించారన్నారు. పలువురు శ్రీనివాసరావు దంపతులను పూలమాలలతో సత్కరించారు.

దళితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): దళితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. కైకలూరు పట్టణంలోని దానగూడెంలో ఈ నెల 5వ తేదీ రాత్రి గణేశ్ నిమజ్జన ర్యాలీలో జరిగిన ఘర్షణలో తీవ్ర గాయాలకు గురైన బాధితులను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.సంతోష్ కుమార్, దళిత నాయకులు పరామర్శించారు. ఆ గ్రామంలో శాంతి కమిటీలను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేయాలని గొల్లా కిరణ్, పెరియర్ ప్రసాద్ కోరారు.

బాధితులకు దళిత సంఘాల పరామర్శ

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): దళితులపై హత్యాయత్నం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని దళిత బహుజన నాయకులు నేతల రమేశ్‌బాబు అన్నారు. గణేశ్ ఉత్సవాల సందర్భంగా జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. కైకలూరులో శుక్రవారం గణేశ్ ఉత్సవాల్లో ఆధిపత్య కులాలకు చెందిన కొందరు వ్యక్తులు పి.అజయ్, జి.దినేశ్, రాజేశ్‌లపై హత్యాయత్నం చేశారన్నారు.

కైకలూరులో ఉద్రిక్తత

(5వ పేజీ తరువాయి)

వివక్ష చూపుతూ దాడులకు పాల్పడ్డారని నిరసన వ్యక్తం చేశారు. సమీపంలోని జనసేన ఫ్లెక్సీలను మహిళలు చింపివేశారు. మళ్లీ ఆందోళనకారులు అక్కడ నుంచి వారపు సంత దగ్గరకు ర్యాలీగా వచ్చి రహదారిపై బైఠాయించడానికి ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకుని లాఠీచార్జి చేసి చెదరగొట్టి దానగూడెం పంపివేశారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ దళిత సంఘాల నేతలతో మాట్లాడి ఆందోళన విరమింపచేసేలా చొరవ చూపారు.మరోవర్గాన్ని శనివారం ఇళ్ల నుంచి బయటకు రానీయకుండా ముందస్తుగానే ఎక్కడికక్కడే కట్టడి చేశారు.

ఏడుగురిపై అట్రాసిటీ కేసు : దానగూడేనికి చెందిన యువకులపై దాడులకు పాల్పడిన జనసేనకు చెందిన తులసీ శివ, తోట కార్తీక్, తులసీ పూర్ణ, మెకానిక్ శివ్, పోతునూరి బాలు, పిచ్చుకల రాజేష్, కొల్లి వరప్రసాద్‌లపై ఎస్సీ ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు కైకలూరుటౌన్ సీఐ పి.కృష్ణ తెలిపారు.

గ్రామస్థులకు కూటమి నేతల పరామర్శ : దానగూడెం గ్రామస్థులను శాంతింప చేసేందుకు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు కూటమి నేతలు శనివారం సాయంత్రం పరామర్శించారు. దాడికి గల కారణాలను తెలుసుకోవడంతో పాటు బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. రాడ్లు, కర్రలు, కత్తులతో దాడులకు పాల్పడుతూ దానగూడెం నుంచి కైకలూరు టౌన్‌లోనికి వెళ్లడానికి చిన్నపిల్లలు భయపడే పరిస్థితులకు తీసుకొచ్చారని కక్షపూరితంగా మాపై దాడులకు పాల్పడ్డారని పోలీసులు ఏకపక్షంగా నిలిచారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులమైన మాపై లాఠీచార్జీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. దీంతో నాయకులు పూర్తిస్థాయిలో పోలీసులతో విచారణ చేయించి చర్యలు తీసుకుంటామన్నారు. కూటమి నేతలు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, పెన్మెత్స త్రినాథరాజు, పీజేఎస్ మాల్యాద్రి, పొత్తూరి వాసురాజు, బలే ఏసురాజు, కేకే బాబు, పేరిచర్ల ప్రసాదరాజు, వీరాబత్తిన సుధా, పడమటి వాసు, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

మైనర్ చెరువులకు మోక్షం

(5వ పేజీ తరువాయి)

ద్వారా నిర్దిష్ట పంట అవసరాలకు అనుగుణంగా ప్రతీ నీటిబొట్టు సద్వినియోగం చేయడానికి అవకాశం ఉంటుంది.

ఇదొక బృహత్తర పథకం..

జలవనరుల శాఖ ఎస్ఈ సీహెచ్ దేవప్రకాశ్

చాలా కాలంగా మైనర్ ఇరిగేషన్ చెరువుల మరమ్మతులు జరగలేదు. 'ట్రిపుల్ ఆర్' పథకంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో దశలవారీగా అభివృద్ధి చేస్తాం. వీటిపై జిల్లా స్థాయి కమిటీలో చర్చించి ఆ మేరకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతాం. ఇదొక బృహత్తర పథకంగా నిలుస్తుంది.

రైతుల్లో ఆందోళన వద్దు

ఎరువులు పుష్కలంగా ఉన్నాయన్న అధికారులు - పలు దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు



పెదపాడులో ఎరువులు పరిశీలిస్తున్న అధికారులు

కామవరపుకోట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కామవరపుకోట మండలం ఎరువుల కొరతలేదని, పుష్కలంగా ఉన్నాయని సొసైటీల వద్ద యూరియా 31.140 టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద 29.900 టన్నులు ఉన్నాయని వ్యవసాయ శాఖ చింతలపూడి డివిజన్ సంచాలకులు వై.సుబ్బారావు, మండల వ్యవసాయ శాఖాధికారి డి.ముత్యాలరావులు తెలిపారు. దీంతోపాటు అమ్మోనియం సల్ఫేట్ 160 టన్నులు నిల్వలు ఉన్నాయని చెప్పారు. ఎరువులు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. సహకార సంఘాల సెక్రటరీలకు, ప్రైవేటు వ్యాపారులకు, వరి పంట సాగు చేసే రైతులకు మాత్రమే యూరియా విక్రయించాలని సూచించారు.

● దెందులూరు: దెందులూరు మండలంలో 47 టన్నుల యూరియా నిల్వలను సిద్ధంగా ఉంచామని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్ కుమారి తెలిపారు. కొవ్వలి సొసైటీ గొడౌన్‌ను ఆమె వ్యవసాయాధికారి ఎల్.శ్రీనివాసరాజు, సొసైటీ ఆడిటర్ ఎల్.బాబులతో కలిసి శనివారం యూరియా నిల్వలను పరిశీలించారు. ఏడీ అనిల్ కుమారి మాట్లాడుతూ మొదటి విడతగా 47 టన్నుల యూరియాను దెందులూరు, కొవ్వలి, రామారావుగూడెం సొసైటీల పరిధిలో నిల్వ చేశారు. బ్యాంకు అధ్యక్షులు వెలమాటి అనిల్‌కుమార్, గారపాటి కొండయ్య చౌదరి, పసుమర్తి మధులు పాల్గొన్నారు.

● పెదపాడు: పెదపాడు సొసైటీ ద్వారా రైతులకు పారదర్శకంగా ఎరువుల పంపిణీకి తగిన చర్యలు తీసుకున్నట్టు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గారపాటి స్టాలిన్ తెలిపారు. పెదపాడు సొసైటీ ద్వారా జరుగుతున్న యూరియా పంపిణీ ప్రక్రియను పెదపాడు నీటి సంఘం అధ్యక్షుడు బొప్పాడి కాశీబాబుతో కలిసి శనివారం పరిశీలించారు. సొసైటీలో జరుగుతున్న ఎరువుల పంపిణీని ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ పరిశీలించారు. సొసైటీ సీఈవో డీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

● పెదవేగి: పంటల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ముండూరు సొసైటీ చైర్మన్ కొనకళ్ల శివమణి అన్నారు. ముండూరు సొసైటీలో యూరియా రైతులకు శనివారం పంపిణీ చేశారు. శివమణి మాట్లాడుతూ పంటలకు అవసరమైన యూరియాను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు.సొసైటీ సెక్రటరీ బీవీఎస్‌వీప్రసాద్ పాల్గొన్నారు.

● లింగపాలెం: మండలంలో యూరియాకు కొరత లేదని మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్ తెలిపారు. మండలంలోని మఠంగూడెం, కే గోకవరం, సొసైటీల్లో 23.4 మెట్రిక్ టన్నులు, బాదరాల సొసైటీలో 16.5 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ షాపుల డీలర్ల వద్ద 35 టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉందన్నారు. రైతులు కొనుగోలు చేసుకుని నిల్వ చేయవద్దని ప్రదీప్ కుమార్ హెచ్చరించారు.

● కొయ్యలగూడెం: మండలంలో 78 టన్నుల యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ శాఖాధికారి కేవీఎస్.పోశారావు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం కొయ్యలగూడెంలో నిల్వ ఉన్న యూరియా గొడౌన్లను పరిశీలించారు. రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎరువులను ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయాశాఖాధికారి పర్యవేక్షణలో సొసైటీలకు, ఎరువుల షాపులకు కేటాయిస్తున్నారని అన్నారు.

ట్రంప్ టారీఫ్‌లపై నిరసన గళం

ఆందోళన చేపట్టిన వామపక్షాల నాయకులు



ఏలూరులో ఆందోళన చేస్తున్న వామపక్షాలు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారత్‌పై అమెరికా సుంకాలను నిరసిసూత పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి రాష్ట్ర నాయకులు యు.వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ ట్రంప్ విధానాలను మార్చుకోవాలన్నారు. వామపక్షాల నాయకులు మన్నవ కృష్ణచైతన్య, ఎ.రవి, బద్దా వెంకట్రావు, పంపన రవికుమార్, ముంగం అప్పారావు, బండి వెంకటేశ్వరరావు,రెడ్డి శ్రీనివాసడాంగే, ఉప్పులూరి హేమ శంకర్, ఆర్.లింగరాజు ఉన్నారు.

● చింతలపూడి: చింతలపూడిలో బోసుబొమ్మ సెంటర్‌లో నిరసిస్తూ ప్రదర్శన జరిపారు. ప్రదర్శనలో నాయకులు పాండురంగారావు, డి.రంగనాథ్, మాణిక్యాలరావు, సూర్యకుమార్, రామిశెట్టి సత్యనారాయణ, ధర్మారావు, టి.బాబు, రెడ్‌స్టార్ నాయకులు రంగనాథ్ పాల్గొన్నారు.

● కుక్కునూరు: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న సుంకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించాలని డిమాండ్ చేస్తూ శనివారం కుక్కునూరులో వామపక్ష నాయకులు నిరసన వ్యక్తం చేశారు. భారత దేశ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50శాతానికి పెంచుతూ ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో భారత ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. నాయకులు కొన్నే లక్ష్మయ్య, వరకా శ్యామలా, కే.బాబురావు, చంద్రరావు, వై.నాగేంద్రరావు, వీరబాబు, కళ్లయ్య, బక్కయ్య పాల్గొన్నారు.

● వేలేరుపాడు: వేలేరుపాడులో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎండీ మున్నీర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అమెరికా సుంకాలపై మోదీ ప్రభుత్వం నోరు మెదపకపోవడం సరికాదన్నారు. బాడిన రాము, సాయిబాబు, పిట్టా ప్రసాద్, బంధం నాగేశ్వ రరావు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: బుట్టాయగూడెం సెంటరులో ఏఐకెఎంఎస్ ఆధ్వర్యంలో ఏఐకేఎంఎస్ నాయకులు ర్యాలీ, నిరసన కార్యక్రమాలు చేశారు. సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కారం రాఘవ మాట్లాడుతూ భారతదేశంపై అమెరికా తీరును తీవ్రంగా ఖండించారు. నాయకులు టి.బాబూరావు, వి.భారతి, బి.వినోద్, న్యాయవాది భాషా శ్యాంబాబు, కాకడ కన్నారావు, కె.రాముడు, కె.రవి, పి.మూకరాజు, కె.ప్రతాప్, డి.మారయ్య పాల్గొన్నారు.

● కామవరపుకోట:స్థానిక చౌతన సెంటర్ వద్ద శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ టి.వి.ఎస్.రాజు మాట్లాడుతూ ట్రంప్ విధించిన సుంకాలను రద్దు చేసేలా భారత ప్రభుత్వం అమెరికాపై ఒత్తిడి చేయాలన్నారు. సీపీఐ నాయకులు గుమ్మడి లక్ష్మీనారాయణ, కె.వెంకటేశ్వరరావు, నల్లమోతుల అప్పన్న, కె.వుల్లయ్య, పిల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: జీలుగుమిల్లి జగదాంబసెంటరులో ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇ.భూషణం, తెల్లం దుర్గారావు, కట్టం నాగేశ్వరరావు, కరక నాగన్న, వెంకటేశ్వరావు, సత్యనారాయణ, సంకురుడ, రామారావు ఉన్నారు.

గంగమ్మ చెంతకు గణనాథుడు



ఏలూరులో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణపతి

ఏలూరు రూరల్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): వెళ్లి రావయ్య గణపయ్య మళ్లీ రావయ్య లంబోదరా అంటూ గణేశ్ నిమజ్జనం కోలాహలంగా సాగింది. భక్తులు స్వామికి పూజలు నిర్వహించి వినాయక విగ్రహాలను గంగమ్మ ఒడికి సాగనంపారు. 99 రోజులు పాటు అశేష భక్తుల పూజలందుకున్న గణనాథుల నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. నగరంలోను, గ్రామాల్లోని యాత్ర ఆద్యంతం కన్నులవిందుగా సాగింది. వినాయక విగ్రహాలకు భక్తులు నీరాజనం పలికారు. డీజే పాటలు.. డప్పు దరువులు, ఆట పాటలు, డప్పు దరువులు, ఆట పాటలు, బాణసంచా మోతలతో నగర వీధులన్నీ హోరెత్తాయి.

● పెదపాడు: భక్తులచే పూజలందుకున్న గణపతి నిమజ్జన కార్యక్రమాలు వాడవాడలా శనివారం ఘనంగా జరిగాయి. పెదపాడుతో పాటు శివారు రామచంద్రాపురం గ్రామాల్లో గణేశ్ నిమజ్జనాలు వైభవంగా నిర్వహించారు. తొలుత రామాలయం కమిటీ యూత్ ఆధ్వర్యంలో లడ్డూల వేలం పాటలను నిర్వహించారు.

● భీమడోలు: భీమడోలులో ఉన్న శ్రీమన్మహాగణపతి, శ్రీఅభయ గణపతి ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలు వేడుకగా జరిగాయి. డప్పువాయిద్యాలు, విచిత్ర వేషధారణలు అలరించాయి. గణపతి సెంటర్‌లో స్వామికి సేవలందించిన రిటైర్డ్ ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావులను సత్కరించారు.

● పోలవరం: పోలవరం మండలంలో గణపతి నవరాత్రులు ముగింపు సందర్భంగా శనివారం మండలంలో పలు గ్రామాల్లో ప్రతిష్ఠించి పూజలు నిర్వహించిన భారీ గణపతి విగ్రహాలను ట్రాక్టర్లపై ప్రధాన రహదారులపై ఊరేగింపు నిర్వహించారు. గణేశ్‌నగర్ వినాయక చవితి కమిటీ ట్రాక్టరుపై ప్రత్యేకంగా బంతి చామంతి పూలతో చేసిన వినాయకుని ఊరేగింపు రథం పలువురిని ఆకట్టుకుంది. మండలంలో విగ్రహాలన్నింటినీ పట్టిసీమ ఫెర్రీ రేవులో నిమజ్జనం చేశారు. పోలవరం సీఐ బాలసురేశ్ బాబు, ఎస్ఐ పవన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

● ఏలూరు కార్పొరేషన్: నగరంలోని పలు డివిజన్లలో గణేశ్ నిమజ్జనాలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. కండీ సెంటర్, రామకోటి ప్రాంగణం, కూరగాయల మార్కెట్, ఎన్ఆర్ పేట తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భారీ గణనాథుల విగ్రహాలను క్రేన్‌లు, లారీల మీదకు ఎక్కించి అనంతరం మేళతాళాలు, బాజాభజంత్రీలు, వసంతోత్సవాలు, విచిత్ర వేషాలతో ఊరేగింపు జరిపారు. ఆరవ డివిజన్‌లోని సుంకరవారి తోటలోని ఇందిరమ్మకాలనీ సముదాయం వద్ద ఉత్సవాల నిర్వాహకులు చిన్ని అర్జున్ బృందం శనివారం భక్తులకు మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. విఘ్నేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణను టీడీపీ నాయకులు చిన్ని అర్జున్ ప్రారంభించారు. సత్రంపాడులోని శ్రీ లక్ష్మీ గణపతిస్వామి ఆలయం వద్ద శనివారంతో చవితి ఉత్సవాలు ముగిశాయి. భారీ ఊరేగింపు నడుమ నిమజ్జనాన్ని నిర్వహించారు. ఆలయ యాజ్ఞిక బ్రహ్మ తూములూరి విశ్వనాథ శాస్త్రి, ఆలయ అర్చకులు రెండుచింతల రాఘవేంద్రశర్మలు భక్తులతో పూజలు చేయించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.చిననాగేశ్వరరావు, సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. ఈనెల 10న ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్టు ఈవో తెలిపారు.

● పెదవేగి: ఆదివారం చంద్రగ్రహణం కావడంతో గణపతి విగ్రహాల నిమజ్జనాలు శనివారంతో పూర్తి చేశారు. పెదవేగి బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడిని నిమజ్జం చేశారు. పెదవేగిలోని రత్నమ్మ కోనేరులో గణనాథుడిని నిమజ్జనం చేశారు.

● జీలుగుమిల్లి: గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో ఆధ్యాత్మికత ఐక్యత పెంచుతాయని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. జీలుగుమిల్లి వినాయక ఆలయం వద్ద గణేశ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహంను దర్శించారు. జనసేన మండల పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము, కోలా మధు, కొట్టే శాంతికుమార్, పాలోజి దుర్గాప్రసాద్, నారగాని నరేంద్ర, చామన శేఖర్, సురేష్, రాజేశ్ ఉన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన

లింగపాలెం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఇంటినుంచే ప్రభుత్వ సేవలు పొందాలనే ఉద్దేశంతో ప్రారంభించిన వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని లింగపాలెం ఎంపీడీవో కె.వాణి అన్నారు. మనమిత్ర యాప్ ద్వారా ప్రజలు ఇంటి నుంచే 709 ప్రభుత్వ సేవలను వినియోగించుకోవచ్చన్నారు. లింగపాలెం మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో కలిసి వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రతి రోజూ గ్రామాల్లో పర్యటించి వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు వివరించినట్టు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో ఎ.సుందరి, మోరంపూడి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణపై అవగాహన

భీమడోలు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత ఆరోగ్య పరిశుభ్రతను పాటిస్తూ రక్తహీనత నివారణకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శోభ అన్నారు. గుండుగొలనులోని పలు పాఠశాల్లో విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపైన ప్రాథమిక వైద్య కేంద్రం అధికారులు అవగాహన కల్పించారు. బాలబాలికల్లో కౌమార దశల్లో వచ్చే మార్పులు పాటించాల్సిన జాగ్రత్తలు వ్యక్తిగత శుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వైద్యులు జాహ్నవిరెడ్డి, మధుసూదనరావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

టి.నర్సాపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి బాధిత కుటుంబాలకు వరం లాంటిదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు తెలిపారు. టి.నర్సాపురం గ్రామానికి చెందిన కొక్కొండ దుర్గాచారికి రూ.25 వేలు, కసాని గంగరాజు రూ.25 వేలు, వీరభద్రవరం గ్రామానికి చెందిన సాయిల శ్రీను, యర్రగొర్ల సుబ్బారావుకు రూ.42 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం ఆయన పంపిణీ చేశారు. టి.నర్సాపురం సొసైటీ చైర్మన్ సోంబాబు, మల్లుకుంట సొసైటీ చైర్మన్ శీలం సాయివినయ్, వెలగపాడు సర్పంచ్ నైనారపు జలపాలు, కొల్లి రమేశ్, పర్సన్ మోదుగ రామారావు, నీటి సంఘం అధ్యక్షులు కనకళ్ల మోహన్‌కుమార్, అద్దంకి జగ్గారావు, రాచబంటు వేములయ్య, సాంబశివరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు

లింగపాలెం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పార్టీపటిష్ఠతకు పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గౌరవం, గుర్తింపు వస్తాయని, తద్వారా నామినేటెడ్ పదవులు వర్తిస్తాయని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర గ్రీనింగ్ అండ్‌బ్యూటీఫికేషన్ డైరెక్టర్ పల్లి శ్రీను ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీని మరింత బలోపేతం చేసేలా కృషి చెయ్యాలని సూచించారు. బోడా అనీష్, శౌరి పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

వేలేరుపాడు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన తెల్లం బాయమ్మ కుటుంబానికి శనివారం మండల జనసేన ఆధ్వర్యంలో సాయం అందించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు ఫోన్ ద్వారా వివరించి ప్రభుత్వం తరుపు నుంచి మరింత ఆర్థిక సహాయాన్ని అందించేలా చూస్తామని ఎమ్మెల్యే బాలరాజు బాధితురాలికి తెలిపారు. జనసేన నాయకులు క్రాంతికుమార్, సుధాకర్, మోహన్‌దొర పాల్గొన్నారు.

త్వరలో మరో రెండు అన్న క్యాంటీన్లు

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కొత్తూరు ఇందిరమ్మ కాలనీలో శనివారం ఎమ్మెల్యే చంటి పర్యటించి అన్న క్యాంటీన్ ఏర్పాటుపై హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో మరో రెండు అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నామన్నారు. దీనిలో ఒకటి ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేస్తామని ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. కార్పొరేటర్ ఎ.నాగబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి పైడి వెంకట్రావు, ఎం.శ్రీనివాసరావు, భాస్కరరావు, సాంబశివరావు, రాంబాబు, సతీశ్ పాల్గొన్నారు.

ముత్యాల వెంకటేశ్వరరావుకు పదవి



నిడమర్రు : ఏపీ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ డైరెక్టర్‌గా బావాయిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ప్రభుత్వం ఈ మేరకు నియామక ఉత్తర్వులు జారీ చేసింది.



ఎంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఎంఈవోలకు ఘన సత్కారం

లింగపాలెం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీవిద్యా పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చలసాని రత్నాకర్ ఆధ్వర్యంలో తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులను, ఎంఈవోలను ధర్మాజీగూడెం శ్రీవిద్యా పాఠశాల విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఎంఈవోలు కె.రామారావు, రవీంద్రలు మాట్లాడుతూ విద్యార్థులు తమపై చూపిన అభిమానం, ఆదరణ మరువలేనివన్నారు. కరస్పాండెంట్ సాయిసునంద పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

నిడమర్రు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని, వారి చేతిలోనే దేశభవిష్యత్తు ఉందని నిడమర్రు ఎంపీడీవో విజయకుమారి అన్నారు. శనివారం నిడమర్రు మండల వనరుల కేంద్రంలో ఉత్తమ ఉపాధ్యాయలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారులు టి.అనూరాధ, యర్రంశెట్టి శేషగిరిరావుల ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయలుగా ఎంపికైన అడబాల అప్పారావు, షేక్ రంగావలిని ఘనంగా సన్మానం చేశారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎస్.జయప్రకాశ్ నారాయణ ఉన్నారు.

డాగ్‌షో వాయిదా

ఏలూరు క్రైం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ సాయంత్రం ఏలూరు జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించ తలపెట్టిన డాగ్‌షోను అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్టు జిల్లా పోలీస్‌శాఖ ఎఆర్‌ఆర్ఐ పవన్‌కుమార్ తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది తరువాత తెలియజేస్తామన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రజకుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఎన్ని జీవోలు ఇచ్చినా క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదని రజక జనసంఘ జిల్లా అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు.శనివారం ఏలూరులోని రజక జనసంఘ కార్యాలయంలో నాయకుల సమావేశం జరిగింది. కట్లయ్య మాట్లాడుతూ చెరువుల లీజు, ఉచిత విద్యుత్ అమలు, దోబీ ఘాట్స్, విశ్రాంతి భవనాలు, చెరువుల ఆక్రమణలు ఇలా రజక వృత్తిదారుల సమస్యల పట్ల ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కొవ్వలి గ్రామ రజక నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా సీనియర్ రజక నేతలు కొమ్మంటి మురళి, పి.శ్రీనివాసు, గొల్లపూడి వెంకటేశ్వరరావు, సాంబశివరావు, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

డ్వామా ఫైనాన్స్ మేనేజర్‌గా శ్రీదేవి

దెందులూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): దెందులూరు ఎంపీడీవోగా పనిచేస్తున్న కంతేటి శ్రీదేవి పదోన్నతి లభించింది. ఆమెను ఏలూరు జిల్లా డ్వామా ఫైనాన్స్ మేనేజర్‌గా పదోన్నతి కల్పించి, బదిలీ చేశారు. పదోన్నతి పొందిన శ్రీదేవికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి ఎకరాకు సాగునీరందిస్తాం

లింగపాలెం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పాలవాగు సప్లైచానల్ పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామని ధర్మాజీగూడెం నీటి సంఘం అధ్యక్షుడు మోరంపూడి వర ప్రసాద్ అన్నారు. పాలవాగు పరిధిలోని అన్ని సాగునీటి కాలువల్లో పూడికతీత పనులను చేపట్టారని, ఇప్పటికే చాలా వరకు పనులు పూర్తి చేశామని మిగిలిన పనులు వెంటనే పూర్తి చేస్తామన్నారు.

9న రైతు పోరు

ఏలూరురూరల్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు విమర్శించారు. రైతు సమస్యలపై ఈ నెల 9న రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఆందోళన ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతు పోరుకు సంబంధించి శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో గోడ పత్రికల ఆవిష్కరించారు. సకాలంలో విత్తనాలు, ఎరువులకు అందించలేక తాత్సారం చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని వైద్య కళాశాలలను చంద్రబాబు తన బినామీలకు కట్టబెట్టేందుకు ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయం సరికాదని, దీనిపై కూడా త్వరలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

పెదపాడు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వట్లూరులోని సర్‌సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో ప్లేస్‌మెంట్, కెరీర్ గైడెన్స్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో, సెట్‌వెల్ సహకారంతో వ్యక్తిత్వ వికాసంపై శనివారం అవగాహన కల్పించారు. మనలోని భయాలను పోగొట్టుకోవడం ద్వారా వృత్తి, ఇతర అంశాల్లో రాణించవచ్చని, కొత్త విషయాలను నేర్చుకునేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు. అలాగే కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందిపుచ్చుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. కె.ఎస్.ప్రభాకరరావు, జానకెనడి, ప్రవీణ్‌కృష్ణ, వంకినేని భానుప్రకాష్, ప్రిన్సిపాల్ జి.సరళ పాల్గొన్నారు.

వంతెనకు మరమ్మతులు

ఉంగుటూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని డెల్టా మెట్ట ప్రాంతాలను కలుపుతూ నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులు చేపట్టారు. గడ్డర్లను తొల గించి రూపురేకలను మార్చేస్తున్నారు. 1931లో నిర్మించిన బ్రిటిష్ కాలం నాటి ఈ వంతెన చారిత్రాత్మక సేవలందించింది. ఏలూరు హైవే వైపు ఇటీవల రంధ్రం పడటంతో మరమ్మతు లకు చర్యలు చేపట్టారు. వంతెన పైభాగం తొలగించి ఇనుప గడ్డర్లకు రంగులు వేస్తున్నారు.



ఏజెన్సీకి నిధులివ్వండి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలంటూ ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు మంత్రి నారా లోకేశ్‌ను కలిసి కోరారు. శనివారం మర్యాద పూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. విద్య, వైద్యం, మంచినీరు, రోడ్లు తదితర సమస్యలు ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించారని చైర్మన్ తెలియజేశారు.

రెండో రోజుకు ఉనికిలి సర్పంచ్ నిరాహార దీక్ష

మండవల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉనికిలి పంచాయతీ కార్యదర్శి సజ్జా రాధిక పంచాయతీలో జరిగే అభివృద్ధి పనులు విషయంలో సహకరించకపోగా తిరిగి అవినీతి ఆరోపణలు చేస్తోందని సర్పంచ్ ఇమ్మడి అన్నమ్మ మండవల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరాహార దీక్ష శనివారం నాటికి రెండోరోజుకి చేరింది. దళిత మహిళా సర్పంచ్‌ను అవమానిస్తూ, అవినీతి ఆరోపణలు ప్రచారం చేస్తున్న పంచాయతీ కార్యదర్శి సజ్జా వెంకట రాధికపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యవసాయ రుణాలపై దృష్టి పెట్టండి

నూజివీడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):వ్యవసాయ, ఇతర ప్రాధాన్యతరంగ రుణాల పైదృష్టిపెట్టాలని లీడ్‌బ్యాంకు మేనేజరు డి.నీలాద్రి అన్నారు. నూజివీడులో నియోజకవర్గ స్థాయిలో బ్యాంకర్ల సంయుక్త కమిటీ సమావేశంలో ఆయన ప్రధాన మంత్రి సూర్యఘర్ రుణాలు, ఎస్.హెచ్.జి రుణ ప్రతిపాదనపై ఆయన సమీక్షించారు. విద్య, గృహ రుణాలు, బ్యాంకుల్లేని ప్రాంతాల్లో బ్యాంకింగ్ అవుట్‌లెట్లు, అన్ని గ్రామీణశాఖల ఆర్థిక అక్షరాశ్యత శిబిరాలను నిర్వహించాలని తెలిపారు.

కన్నుల పండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



నూజివీడు టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పండ్ల మార్కెట్ సెంటర్లో శనివారం వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ధర్మప్రచార పరిషత్ విశ్రాంత ఉద్యోగులు కుమార్ నేతృత్వంలో కల్యాణం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ, అన్నమయ్య కీర్తనల ఆలాపనతో ఘనంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది.

అవార్డు గ్రహీతకు మంత్రి అభినందన



ఆగిరిపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి ఎన్‌ఆర్‌ఐ కాలేజీలో ఈఈఈ విభాగాధిపతి, అధ్యాపకులు డాక్టర్ నారబోయిన సాంబశివరావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన సందర్భంగా శనివారం విజయవాడ క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అభినందించారు. మరిన్ని అవార్డులు, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంత్రి ఆకాంక్షించారు.

విజ్ఞానానికి దారి చూపేవాడే గురువు



ముసునూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అజ్ఞానమనే చీకటిలో ఉన్నవారికి విజ్ఞానమనే దారిని చూపి వారి జీవితాలలో వెలుగును నింపే గురువే ఉపాధ్యాయుడని మండల విద్యాశాఖాధికారి బి.వి.యస్ సుబ్బారావు అన్నారు. శనివారం మండలంలోని పలు పాఠశాలల్లో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముసునూరు జడ్పీ పాఠశాల, భారతీయ విద్యానికేతన్ హై స్కూల్‌లో జరిగిన గురుపూజోత్సవ వేడుకల్లో ఎంఈవో ముఖ్య అతిథిగా పాల్గొని ఉపాధ్యాయ వృతి యొక్క విశిష్టతను వివరించారు. అనంతరం ఉపాధ్యాయులు ఎంఈవోను సత్కరించారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కలిదిండి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ అభివృద్ధి చైర్మన్ కొల్లు పెద్దిరాజు అన్నారు. శనివారం మట్టగుంట గ్రామాన్ని సందర్శించి మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన మత్స్యకారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు కమలదాసు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కైకలూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులను నివారించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ అనుపమ అన్నారు. శనివారం కైకలూరు మండలం దొడ్డిపట్ల జడ్పీ హైస్కూల్లో కిశోర వికాసంపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ విద్యార్థులు రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన ఆహారపదార్థాలను వివరించారు. ఎప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కుని ఆహారాన్ని తీసుకుంటే వ్యాధులబారిన పడకుండా వచ్చన్నారు.

మైనర్ చెరువులకు మోక్షం

(5వ పేజీ తరువాయి)

ద్వారా నిర్దిష్ట పంట అవసరాలకు అనుగుణంగా ప్రతీ నీటిబొట్టు సద్వినియోగం చేయడానికి అవకాశం ఉంటుంది.

ఇదొక బృహత్తర పథకం..
జలవనరులశాఖ ఎస్ఈ సీహెచ్ దేవప్రకాశ్

చాలా కాలంగా మైనర్ ఇరిగేషన్ చెరువుల మరమ్మతులు జరగలేదు. ట్రిపుల్ ఆర్ పథకంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో దశలవారీగా అభివృద్ధి చేస్తాం. వీటిపై జిల్లా స్థాయి కమిటీలో చర్చించి ఆ మేరకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతాం. ఇదొక బృహత్తర పథకంగా నిలుస్తుంది.



కైకలూరు కరగట్ట వద్ద శుక్రవారం అర్ధరాత్రి పరిస్థితిని సమీక్షిస్తున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్

కైకలూరులో ఉద్రిక్తత

(5వ పేజీ తరువాయి)

వివక్ష చూపుతూ దాడులకు పాల్పడ్డారని నిరసన వ్యక్తం చేశారు. సమీపంలోని జనసేన ఫ్లెక్సీలను మహిళలు చింపివేశారు. మళ్లీ ఆందోళనకారులు అక్కడ నుంచి వారపు సంత దగ్గరకు ర్యాలీగా వచ్చి రహదారిపై బైఠాయించడానికి ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకుని లాఠీచార్జి చేసి చెదరగొట్టి దానగూడెం పంపివేశారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ దళిత సంఘాల నేతలతో మాట్లాడి ఆందోళన విరమించేలా చొరవ చూపారు. మరోవర్గాన్ని శనివారం ఇళ్ల నుంచి బయటకు రానీయకుండా ముందస్తుగానే ఎక్కడికక్కడే కట్టడి చేశారు.

ఏడుగురిపై అట్రాసిటీ కేసు నమోదు

దానగూడెంకు చెందిన యువకులపై దాడులకు పాల్పడిన జనసేనకు చెందిన తులసీ శివ, తోట కార్తీక్, తులసీ పూర్ణ, మెకానిక్ శివ్, పోతునూరి బాలు, పిచ్చుకల రాజేష్, కొల్లి వరప్రసాద్‌లపై ఎస్సీఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు కైకలూరుటౌన్ సీఐ పి.కృష్ణ తెలిపారు.

దానగూడెం గ్రామస్థులకు కూటమి నేతల పరామర్శ

దానగూడెం గ్రామస్థులను శాంతింప చేసేందుకు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు కూటమి నేతలు శనివారం సాయంత్రం పరామర్శించారు. దాడికి గల కారణాలను తెలుసుకోవడంతో పాటు బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. రాడ్లు, కర్రలు, కత్తులతో దాడులకు పాల్పడుతూ దానగూడెం నుంచి కైకలూరు టౌన్‌లోనికి వెళ్లడానికి చిన్నపిల్లలు భయపడే పరిస్థితులకు తీసుకొచ్చారని కక్షపూరితంగా మాపై దాడులకు పాల్పడ్డారని పోలీసులు ఏకపక్షంగా నిలిచారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులమైన మాపై లాఠీచార్జీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామ న్నారు. దీంతో నాయకులు పూర్తిస్థాయిలో పోలీసులతో విచారణ చేయించి చర్యలు తీసుకుంటామన్నారు. కూటమి నేతలు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, పెన్మెత్స త్రినాథరాజు, పీజేఎస్ మాల్యాద్రి, పొత్తూరి వాసు రాజు, బలే ఏసురాజు, కేకే బాబు, పేరిచర్ల ప్రసాదరాజు, వీరాబత్తిన సుధా, పడమటి వాసు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

అమ్మో.. వంతెనలు!



పేరూరు వద్ద పోల్‌రాజ్ డ్రైన్‌పై నాలుగేండ్ల క్రితం కూలిన వంతెన



ఉప్పరగూడెం వద్ద పెదలంక మేజర్ డ్రెయిన్ వంతెనపై ఏడేళ్ల క్రితం విరిగిన రెయిలింగ్



శ్రీహరిపురం వద్ద సిబి కెనాల్‌పై శిథిలావస్థకు చేరిన 90 ఏళ్ల నాటి వంతెన

శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిలు దడ పుట్టిస్తున్నాయి. కొన్ని పూర్తిగా కూలిపోయి.. మరికొన్ని కూలేందుకు సిద్ధంగా ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, పాలకులు తక్షణం వంతెనల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కైకలూరు నియోజకవర్గంలో శిథిల వంతెనల దుస్థితిపై ఆంధ్రజ్యోతి పరిశీలన..

ముదినేపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలో పలు వంతెనలు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా ఉన్నాయి. ముదినేపల్లి - భీమవరం స్టేట్ హైవేలో శ్రీహరిపురం వద్ద 1933లో నిర్మించిన వద్ద నిర్మించిన వంతెన రెయిలింగ్స్, రక్షణ గోడలు విరిగిపోయాయి. బొమ్మినంపాడు వద్ద క్యాంప్ బెల్ కెనాల్‌పై ఉన్న వంతెన స్లాబు నుంచి రోడ్డు విడిపోయే పరిస్థితి నెలకొన్నప్పటికీ పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పట్టించుకోవటం లేదు. పోల్‌రాజ్ మేజర్ డ్రెన్‌పై పేరూరు గ్రామం వద్ద వంతెన కూలిపోయి నాలుగేళ్ల గడుస్తున్నా కొత్త వంతెన నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. కొత్త వంతెన నిర్మాణానికి రూ.3 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించామని ఇప్పుడు ఆ వ్యయం రూ.6 కోట్లకు చేరటంతో ఫైలు పెండింగ్‌లో ఉందని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. తాత్కాలికంగా వంతెనపై గ్రామస్థులు ఐరన్ ప్లేట్లు ఏర్పాటు చేసుకుని కాలినడకకే పరిమితమయ్యారు. సింగరాయపాలెం - బంటుమిల్లి ప్రధాన రహదారిలో పెదలంక మేజర్ డ్రైన్‌పై ఉప్పరగూడెం వద్ద వంతెన రెయిలింగ్స్ విరిగి ఏడేళ్ల గడిచినా పట్టించుకున్న వారు లేరు. ఆ వంతెనపై వాహనాల రాకపోకలు ప్రమాదకరంగా ఉన్నాయి. దేవరం డ్రైన్‌పై అన్నవరం గ్రామం వద్ద ఉన్న వంతెన కూలిపోయి రెండేళ్ల గడిచినా కొత్త వంతెన నిర్మాణానికి అధికార వర్గాలు తీసుకున్న చర్యలు శూన్యమనే చెప్పాలి.

ఆంధ్రజ్యోతి పరిశీలన



కోరుకొల్లులో రైలింగ్ విరిగి శిథిలావస్థలో ఉన్న వంతెన



కలిదిండి లాల్వ డ్రెయిన్‌పై కూలిన వంతెన

కలిదిండి: కోరుకొల్లులో సీబీ కెనాల్‌పై వంతెన శిథిలావస్థకు చేరింది. నాలుగు దశాబ్దాల క్రితం ఈ వంతెన నిర్మించారు. స్లాబ్ పెచ్చులూడి చువ్వలు బయటపడ్డాయి. రాష్ట్ర రహదారి ఈ వంతెనపై నుంచి వెళ్లటంతో నిత్యం హైదరాబాద్, విజయవాడ, భీమవరం, గుడివాడ ఎక్స్‌ప్రెస్ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ వంతెన పక్కనే అయ్యప్పస్వామి దేవాలయం ఉండటంతో వంతెన భక్తులతో రద్దీగా ఉంటుంది. అలాగే కలిదిండి - కైకలూరు ప్రధాన రహదారిలో లాల్వ డ్రెయిన్‌పై ఉన్న వంతెన నాలుగేళ్ల క్రితం కూలిపోయింది. దీంతో తాత్కాలికంగా రహదారి ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి కొట్టుకుపోయింది. శాశ్వత వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



కైకలూరు పుల్లవ డ్రెయిన్‌పై శిథిలస్థితిలో వంతెన

అధికారుల అవగాహన లోపంతో నిలిచిన నిర్మాణం

కైకలూరు: సుమారు ఆరు దశాబ్దాల క్రితం కైకలూరు-కలిదిండి ఆర్‌అండ్‌బీ రహదారిలో పుల్లవ డ్రెన్‌పై వంతెన శిథిలావస్థకు చేరింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త వంతెనల నిర్మాణానికి ప్రతిపాద నలు పంపమనడంతో అధికారులు రూ.కోటిన్నర వ్యయంతో ప్రతిపాదనలు తయారు చేయగా అనుమతులు మంజూరయ్యాయి. అయితే పాత వంతెన స్థానంలో ఎదురెదురుగా వాహనాలు తప్పుకునేందుకు అవకాశం లేకుండా మరలా అదే రీతిలో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినట్లు తెలుసుకుని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని వంతెన వెడల్పు పెంచి నూతనంగా వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలని ఆదేశించారు. ముందుగానే అధికారులు ప్రణాళికబద్ధంగా వంతెన వెడల్పు చేసి ప్రతిపాదనలు చేసుంటే వంతెన నిర్మాణ పనులు జరుగుతుండేవని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యూరియా పక్క రాష్ట్రానికి తరలనివ్వద్దు



చనుబండ చెక్‌పోస్టులో తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

చాట్రాయి/ఆగిరిపల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): యూరియా పక్క రాష్ట్రానికి తరలకుండా నిఘా కట్టుదిట్టం చెయ్యాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్‌బాషా అధికారులను ఆదేశించారు. తెలంగాణ సరిహద్దులో ఉన్న చనుబండలోని ఏఎంసీ చెక్‌పోస్టును శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం నరసింహారావుపాలెం పీఏసీఎస్ ఎరువుల గోడౌన్ పరిశీలించి మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో 35 మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉన్నదని, చాట్రాయి మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 7 పీఏసీఎస్‌ల ద్వారా 850 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు షాపుల ద్వారా 550 మెట్రిక్ టన్నులు మొత్తం 1400 మెట్రిక్ టన్నులు యూరియా రైతులకు అందించామన్నారు. ఆగిరిపల్లి మండలంలోని ఈదర, అడవినెక్కలం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలలో యూరియా పంపిణీని హబీబ్ బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా కొనుగోలు చేయడానికి వచ్చిన రైతులు లైన్‌లో నిలబడి ఉంటున్నారని వారికి కుర్చీలు ఏర్పాటు చేయవలసిందిగా సహకార సంఘ సిబ్బందిని ఆదేశించారు. యూరియా అందుబాటులో ఉంచుతామని రైతులు ఆందోళన చెంద వద్దన్నారు.

897 మెట్రిక్‌టన్నుల యూరియా సరఫరా

నూజివీడు టౌన్:నూజివీడు మండలంలో రైతుల అవసరాలు తీర్చేందుకు 897మెట్రిక్‌టన్నుల యూరియా, మార్క్‌ఫెడ్, హోల్‌సేల్ డీలర్ల ద్వారా సరఫరా చేసినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి పి.చెన్నారావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబరు 6వ తేదీవరకు ఖరీఫ్ 2025ను దృష్టిలో పెట్టుకుని 897.69 మెట్రిక్‌టన్నుల యూరియా మార్క్‌ఫెడ్, హోల్‌సేల్ డీలర్ల ద్వారా సరఫరా చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ దుకాణాలు, పీఏసీఎస్‌లలో 32మెట్రిక్‌టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. రైతులకు అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని మరో 60 మెట్రిక్‌టన్నులు కూడామార్క్‌ఫెడ్ కు ఇండెంట్ పెట్టడం జరిగిందన్నారు. ఇప్పటికి 32 మెట్రిక్‌టన్నుల యూరియా నిల్వలు రైతులకు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు.

జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

విజిలెన్స్ తనిఖీలు.. ఎరువులు స్వాధీనం

నూజివీడు మండల పరిధిలోని ఎరువుల దుకాణాలు, గోదాములను వ్యవసాయ శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు టన్నుల కాంప్లెక్స్ ఎరువులను స్వాధీన పరుచుకున్నట్లు విజిలెన్స్ ఏవో జి.మీరయ్య, ఎస్సై రంజిత్‌కుమార్ తెలిపారు. నూజివీడు పట్టణంలోని విజయసాయి ట్రేడర్స్, లక్ష్మీ శ్రీనివాస ట్రేడర్స్, విజయసాయి ట్రేడర్స్‌లను తనిఖీ చేయగా, కాంప్లెక్స్ ఎరువుల్లో వ్యత్యాసాలను గుర్తించి రూ. లక్షా 14 వేల 250ల విలువగల 4.650 టన్నుల కాంప్లెక్స్ ఎరువులను సీజ్ చేశారు. అదేవిధంగా లక్ష్మీ శ్రీనివాసా ట్రేడర్స్‌లో ఫారమ్ 0 సక్రమంగా లేని నేపథ్యంలో 17.75 టన్నుల ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలుపు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో నూజివీడు మండల వ్యవసాయశాఖ అధికారి పలగాని చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.



లడ్డూను దక్కించుకున్న మాజీ ఎంపీటీసీ కొనకళ్ల

గణేశ్ లడ్డూ.. రూ. 16.63 లక్షలు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):నూజివీడు మండలం మిట్టగూడెంలో గణేశుడి ప్రసాదం లడ్డూ వేలంలో రికార్డు ధర పలికింది. శనివారం మిట్టగూడెంలో లడ్డూ వేలంపాటను నిర్వహించగా అత్యధికంగా రూ.16.63 లక్షల ధర పలికిం ది. గ్రామ మాజీ ఎంపీటీసీ కొనకళ్ళ మాధ వరావు లడ్డూను దక్కించుకున్నారు. గత ఏడాది లడ్డూను రూ.9 లక్షలకు పైగా వేలంలో ఆయనే దక్కించుకున్నారు. లడ్డూ ను సర్పంచ్ కొనకళ్ళ నరసింహారావు, వినా యక ఉత్సవ కమిటీ సభ్యులు మాధవ రావుకు అందించారు.

యూరియా కేటాయింపులు పెంచాలి: ఎంపీపీ

ముదినేపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌కు అవసరమైనంత మేరకు ప్రభుత్వం యూరియాను సరఫరా చేయాలని ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. యూరియా కోసం రైతులు సహకార సంఘాల వద్ద, ప్రైవేటు ఎరువుల డీలర్ల వద్ద పడిగాపులు పడి ఉండాల్సి వస్తున్నదన్నారు. శనివారం ఆయన ముదినేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. రైతులకు సరిపడినంత యూరియా అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు.

నేలబావిలో పడి వ్యక్తి మృతి

ముసునూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలం లోని అన్నవనేనివారి గూడెంకు చెందిన ఉమ్మడి కిషోర్ (30) శుక్రవారం తన పొలంలో ఉన్న నేలబావి చుట్టు జంగిల్‌ను శుభ్రం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. అయితే రాత్రి వరకు కిషోర్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో పోలీసులు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఎం.చిరంజీవి గ్రామంలో విచారణ చేసి, నేలబావిలో సిబ్బందితో వెతికించారు. బావిలో ఉన్న చెత్తలో చిక్కుకుపోయిన కిషోర్ మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి కుమారుడు ఉన్నాడు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ఆగిరిపల్లి, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండలం, అమ్మవారి గూడేనికి చెందిన ఓ యువతి విజయవాడలో తల్లితో కలిసి బస్సెక్కిన కొద్దిసేపటికే అదృశ్యమైన సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. మల్లంపల్లి శాంతి (26), తల్లి బుజ్జితో కలిసి ఈ నెల 1న బంధువుల ఇంటికి హైద్రాబాదు వెళ్ళారు. తిరిగి శుక్రవారం విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌కు వచ్చారు. అనంతరం ఆగిరిపల్లి బయలుదేరేందుకు బస్సు ఎక్కారు. అయితే బస్సు ఎక్కిన కొద్ది సేపటికే తల్లికి శాంతి కనిపించకపోవడంతో అవాక్కయింది. దీంతో కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

నూజివీడు టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సాంకేతికతతో సైబర్ నేరాలు పెరిగాయని, బ్యాంకు లావాదేవీలపై పూర్తి అవగాహనతో ఉండాలని, నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్వీ ప్రసాద్ అన్నారు. శనివారం నూజివీడులో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో వినియోగదారులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సైబర్ క్రైం ప్రధాన సమస్యగా మారిందన్నారు. గత ఏడాది రూ. 25,248 కోట్లను సైబర్ నేరగాళ్ళు మాయం చేశారన్నారు. గతంలో చేతిలో ఉన్న డబ్బుతో దొంగలు ఉడాయించే వారని, నూతన సాంకేతికతను అందిపుచ్చుకున్న నేరగాళ్ళు సైబర్‌వల విసిరి మనం బ్యాంకుల్లో దాచుకున్న నగదును కొల్లగొడుతున్నార న్నారు. పాస్‌వర్డ్‌లను కాని, లేదా లింక్‌లను ఆమోదించే సందర్భాల్లో ఒకటికి, రెండుసార్లు పరిశీలించుకోవా లన్నారు. ఎస్‌బీఐ డీఎండీ సత్యేంద్రకుమార్ సింగ్, రీజనల్ మేనేజరు రాచపూడి రాఘవరావు, ఏజీఎం దాసరి బదరి కృష్ణ తదితరులు ఎస్‌బీఐ సేవలను వివరించారు. నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్, రావిచర్ల సర్పంచ్ కాపా శ్రీనివాసరావు, హనుమంతులగూడెం సర్పంచ్ మల్లయ్య, లీడ్ బ్యాంకు మేనేజరు డి.నీలాద్రి తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోండి

కైకలూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డిజిటల్ సేవలను అందించేందుకు శ్రీకారం చుట్టిందని ఇన్‌చార్జి ఎండీవో వై రామకృష్ణ అన్నారు. శనివారం కైకలూరు తాలుకా సెంటర్లో ప్రజల చేతిలో ప్రభుత్వం 95523 00009 ద్వారా వాట్సాప్ గవర్నర్స్ సేవలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్కానర్ ద్వారా ప్రజలకు ఏవిధమైన ధ్రువీకరణ పత్రాలు కావాల్సినా వాటిని తీసుకోవచ్చని ప్రభుత్వ కార్యాలయాలకు రాకుండా ఈ యాప్‌ను



వినియోగించుకోవాలన్నారు. దీని ద్వారా 200 రకాల సేవలు పజలకు అందుతాయన్నారు. ఈవోపీఆర్డీ ఎం. రవికిరణ్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతులు

ముదినేపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2024-25 సంవత్సరంలో 6 నుంచి పదవ తరగతి వరకు తమ ప్రతిభను చూపిన పలువురు విద్యార్థులకు ఆ హైస్కూలు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు మాగంటి బాపినీడు దంపతుల స్మృత్యర్థం నగదు బహుమతులను అందజేశారు. శనివారం హెచ్‌ఎం వై.విజయ కుమార్ అధ్యక్షతన హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో టెన్త్‌లో ప్రథమ స్థానం సాధించిన బొర్రా త్రివేణికి రూ.10 వేలు, ద్వితీయ స్థానం సాధించిన కె.నాగ వెంకట హనీత్‌కు రూ.5 వేలు, తొమ్మిది, ఎనిమిది, ఏడు, ఆరవ తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన స్రవంతి, కృప,



ఫణీంద్ర, దివ్య, జాహ్నవి, చంద్రిక లక్ష్మీ, శ్రీ సూర్య, యశశ్రీకి రూ.3 వేల నుంచి రూ.1000ల వరకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ముదినేపల్లి డీసీ వైస్ ఛైర్మన్ హనుమార పేర్నీడు, బాపినీడు కుటుంబసభ్యులు, వల్లూరుపాలెం హైస్కూల్ హెచ్‌ఎం స్వరాజ్యలక్ష్మీ, రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం విజయ కుమార్, తెలుగు పండిట్ వెంకట సుబ్రహ్మణ్యంను సత్కరించారు.

దొంగ నోట్ల ముఠా అరెస్టు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అమాయకులను నమ్మించి మోసగిస్తున్న నకిలీ నోట్ల ముఠాను పట్టుకున్నట్టు సీఐ ఎం.వి.సుభాశ్ శనివారం తెలిపారు.ఈనెల 5వ తేదీ శుక్రవారం జంగారెడ్డిగూడెం పట్టణ శివారులోని బాట గంగా నమ్మ లే అవుట్ కాలనీ సమీపంలో గోపాల పురం గ్రామానికి చెందిన ఏలేటి చంద్రశేఖర్, జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన లాగు శ్రీను,జంగారెడ్డిగూడెం మండలం నాగులగూడెం గ్రామానికి చెందిన మొత్రపు వంశీ కుమార్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ సందర్భంగా సీఐ సుభాశ్ మాట్లాడుతూ నల్లరంగులో కాగితాలు ఒక ప్రత్యేక ద్రావణంలో ముంచితే అసలైన నోటుగా మారుతుందంటూ అమాయకులను నమ్మించి మోసగిస్తున్నారని అ న్నారు. ప్రజలు ఇటువంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిందితుల నుంచి చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ముద్రించిన ఐదు వందల నోట్లు 255, నకిలీ ఐదు వందల నల్ల నోట్లు పది, రూ.50 వేల నగదు, రసాయన ద్రావణం సీసా, ద్విచక్ర వాహనం స్వాధీ నం చేసుకుని ముగ్గురు నిందితులను రిమాండుకు తరలించినట్టు తెలిపారు. నకిలీ నోట్ల ముఠాను పట్టుకున్న సీఐ సుభాశ్, ఎస్.ఐ. జబీర్‌లను డీఎస్పీ రవి చంద్ర అభినందించారు.